తెలుగు దినపత్రిక

# సిరి

People's Voice — వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

01-05-2026

శుక్రవారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 90

PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–


## భూసేకరణతో ప్రమాదంలో గ్రామాల భవిష్యత్తు



- టీజీ ఐఐసీ, హెచ్ఎండీఏ భూసేకరణతో ఇబ్బందులు
- ఇందిరమ్మ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుల్లోనూ లోపాలు

**సంగారెడ్డి, (సిరి న్యూస్):**

గ్రామాల్లో కనీస సౌకర్యాలు, అవసరాల కోసం కూడా స్థలం లేకుండా మొత్తం భూములను స్వాధీనం చేసుకుంటే భవిష్యత్తులో తీవ్ర సమస్యలు తలెత్తుతాయని అని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు.

7

## కార్మిక, కర్షక లోకానికి కేసీఆర్ మే డే శుభాకాంక్షలు



**హైదరాబాద్, ఏప్రిల్ 30 (సిరి న్యూస్) :**

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మే డే) సందర్భంగా బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కే . చంద్రశేఖర్ రావు గారు కార్మిక కర్షక లోకానికి శుభాకాంక్షలు తెలిపారు. ఉత్పత్తి రంగంలో భాగమై దేశ సంపదను సృష్టిస్తున్న కార్మికుల రెక్కల కష్టం, వారి త్యాగాలు అమూల్యమైనవని కొనియాడారు. చారిత్రాత్మక మే డే స్పూర్తితో బీఆర్ఎస్ ప్రభుత్వం, సబ్బండ కులాల కర్షక కార్మికుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను, ఆదర్శవంతమైన పారిశ్రామిక విధానాలను అమలు చేసిందని అన్నారు. సింగరేణి, ఆర్టీసీ, భవన నిర్మాణ రంగం సహా పలు రంగాలకు చెందిన కార్మికులు, ఆటో డ్రైవర్లు, దినసరి కూలీలు, అసంఘటిత రంగ కార్మికుల కోసం గత బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను కేసీఆర్ గుర్తు చేశారు.

## జవాబుదారీతనం పెంచేందుకే ‘సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్’

- విద్యార్థులకు సకాలంలో పాఠ్య సామగ్రి అందాలి
- వస్తువుల నాణ్యత విషయంలో రాజీపడొద్దు
- ప్రతీ విద్యార్థి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి

**హైదరాబాద్, ఏప్రిల్ 30 (సిరి న్యూస్):**

విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా సకాలంలో అందేలా చూడాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దుస్తులు, నోటు పుస్తకాలు, ఇతర సామగ్రి

మిగతా 2వ పేజీలో..



## కవిత పార్టీ పేరు తెలంగాణ రక్షణ సేన

- ఆమోదించిన కేంద్ర ఎన్నికల సంఘం




2

## రైతు గోస తగులుతుంది

- కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల కన్నీరు
- కేంద్రం నిధులిస్తున్నా రాష్ట్రం ఎందుకు కొనడం లేదు?
- మిల్లర్లు, దళారుల కుమ్మక్కుపై చర్యలు తీసుకోవాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు



3

## గురు తేజ్ బహదూర్ త్యాగం నిరుపమానం

- పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి

6






# కాషాయదళం ఫోకస్

- ఐదు రాష్ట్రాల ఫలితాల తర్వాత మరోసారి టార్గెట్
- మోదీ జనాగ్రహ సభతో తెలంగాణలో కొత్త రాజకీయ వ్యూహం
- బెంగాల్ ఫలితాలే మిషన్ తెలంగాణకు కీలక మలుపు?
- బీఆర్ఎస్, కాంగ్రెస్‌పై ఏకకాలంలో దాడికి బీజేపీ సన్నాహాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 30 (సిరి న్యూస్):**

తెలంగాణలో రాజకీయ సమీకరణాలను మరోసారి తమకు అనుకూలంగా మలచుకోవాలన్న స్పష్టమైన వ్యూహంతో భారతీయ జనతా పార్టీ రాష్ట్రంపై ఫోకస్ పెంచుతోంది. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో గణనీయ స్థాయిలో విజయాలు నమోదు చేయడం, అనంతరం స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఓటు బ్యాంకును విస్తరించుకోవడం బీజేపీకి తెలంగాణపై కొత్త ఆశలను కల్పించింది. దక్షిణాదిలో కర్ణాటక తర్వాత బలమైన రాజకీయ స్థావరంగా తెలంగాణను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో కమలనాథులు మరోసారి ప్రత్యేక కార్యాచరణకు




సిద్ధమవుతున్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల అనంతరం ప్రధాని నరేంద్ర మోదీని రంగంలోకి దించి రాష్ట్రంలో భారీ రాజకీయ

మిగతా 2వ పేజీలో..

## నిరంతర విద్యుత్ సరఫరా లక్ష్యం

- ఎండలతో డిమాండ్ పెరిగినా లోటు లేకుండా చర్యలు
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

2



## దేశానికే ఆదర్శంగా అక్రిడిటేషన్ల జారీ

- సంఖ్య తేలితే జర్నలిస్టులకు మరిన్ని సౌకర్యాల కల్పన
- 10లోగా దరఖాస్తు చేసుకున్న వారందరికీ అక్రిడిటేషన్లు
- 1న అన్ని జిల్లాల్లో అక్రిడిటేషన్ల పంపిణీకి కలెక్టర్లకు ఆదేశం
- 15వరకు అందరికీ బస్సు పాస్‌ల పొడిగింపు
- సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి



3

## విమర్శలు కాదు.. ఫలితాలే ప్రమాణం

- చరిత్ర సృష్టించిన సంక్షేమ గురుకులాలు
- 99.12% రికార్డుతో కార్పొరేట్ సంస్థలను అధిగమించిన విద్యార్థులు
- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

2





## నకిలీ విత్తనాల నిరోధానికి కఠిన చర్యలు

- నాణ్యమైన విత్తనాలనే అందుబాటులో ఉంచాలి
- కో మార్కెటింగ్‌పై నిర్దిష్ట నియమాలు రూపొందించాలి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

## ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దాతృత్వం

- స్టేజిపైనే లక్షల రూపాయల ఆర్థిక సాయం
- అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సాయం

**హైదరాబాద్, ఏప్రిల్ 30 (సిరి న్యూస్):**

కాంగ్రెస్ సీనియర్ నేత, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తన వ్యాఖ్యలతో మాత్రమే కాకుండా తన దాతృత్వ గుణంతో కూడా తరచూ వార్తల్లో

మిగతా 6వ పేజీలో..



## యాదాద్రిలో నర్సింహ స్వామి జయంతి ఉత్సవాలు



3

## యువ పోలీసుల చేతుల్లోనే పోలీస్ శాఖ ప్రతిష్ట

- ఫ్రెండ్లీ పోలీసింగ్ ప్రస్తుతం అత్యంత కీలకం
- కొత్త డీజీపీ సీవీ ఆనంద్ కు అభినందనలు
- వీడ్కోలు సన్మానంలో డీజీపీ శివధర్ రెడ్డి

3



## క్రమశిక్షణకు మారుపేరు కాంగ్రెస్ సేవాదళ్

- గాంధీ ఆలోచనలతో అవతరించింది
- స్వాతంత్య్రం సాధనలో కాంగ్రెస్ పాత్ర అమోఘం : మంత్రి సీతక్క




3

# నకిలీ విత్తనాల నిరోధానికి కఠిన చర్యలు

- నాణ్యమైన విత్తనాలనే అందుబాటులో ఉంచాలి
- కో మార్కెటింగ్‌పై నిర్దిష్ట నియమాలు రూపొందించాలి
- హెచ్‌టీ పత్తి విత్తనాలు రాష్ట్రంలోకి రానివ్వద్దు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

**హైదరాబాద్, ఏప్రిల్ 30 (సిరి న్యూస్):**



రైతులకు నాణ్యమైన, అధిక దిగుబడి ఇచ్చే విత్తనాలనే అందుబాటులో ఉంచాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ, సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, విత్తన కంపెనీ ప్రతినిధులతో ఆయన సచివాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. వానాకాలం (ఖరీఫ్) 2026 సాగు సన్నాహకంలో భాగంగా వచ్చే ఖరీఫ్‌కు సంబంధించి విత్తనాల లభ్యతను కంపెనీల వారీగా, పంటల వారీగా సమీక్షించారు. వానాకాలం 2026లో రాష్ట్రంలో సుమారు 134.66 లక్షల ఎకరాల్లో సాగు జరిగే అవకాశముండగా దానికి 19.42 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అంచనా. ప్రస్తుతం రాష్ట్రంలో 38.21 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, అవసరానికి దాదాపు రెండింతల నిల్వలు సిద్ధంగా ఉన్నాయని మంత్రి తెలిపారు. సుమారు 52 లక్షల ఎకరాల పత్తి సాగు లక్ష్యంతో రైతులకు అవసరమైన 104 లక్షల ప్యాకెట్లకు బదులుగా 212.11 లక్షల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని అధికారులు వివరించారు. గత ఏడాది వినియోగంతో పోలిస్తే ఈసారి అధిక నిల్వలు రైతులకు విశ్వాసాన్ని కలిగిస్తాయని మంత్రి పేర్కొన్నారు. హైబ్రిడ్ విత్తనాల లభ్యతపై ప్రత్యేకంగా చర్చిస్తూ రైతుల అవసరాలకు అనుగుణంగా మార్కెట్లో డిమాండ్ ఉన్న విత్తనాలను ప్రాధాన్యంగా సరఫరా చేయాలని సూచించారు. విత్తనాల నాణ్యతపై ఎలాంటి రాజీ పడకూడదని, సీడ్ టెస్టింగ్ ల్యాబ్‌ల ద్వారా నిరంతర పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. నాణ్యత లేని విత్తనాల తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ గతంలో సబ్ స్టాండర్డ్ విత్తనాలపై కేసులు నమోదు చేసి లైసెన్సులు రద్దు చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ప్రతి నెలాఖరులో కంపెనీలు తమ స్టాక్ వివరాలను ప్రభుత్వానికి అందజేయాలని, సెల్ఫ్ సర్టిఫైడ్ విత్తనాల వల్ల నష్టం కలిగితే కంపెనీలే భరించాలని అన్నారు. వరి సన్న రకాల ఎంపికలో రైతులు, మిల్లర్లు, వినియోగదారుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అంతర్జాతీయ ఎగుమతి ప్రమాణాలకు అనుగుణంగా ఎంపిక చేయాలని మంత్రి సూచించారు. కంపెనీలు తమ విత్తనాల స్టాక్‌ను మే 15 నుండి రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

**ప్రత్యేక టాస్క్‌ఫోర్సు బృందాలు ఏర్పాటు చేయాలి**

నకిలీ విత్తనాల నిఘా గురించి మంత్రి మాట్లాడుతూ జిల్లా నుండి మండలస్థాయి వరకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేసి అక్రమ నిల్వలు, రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా లూజ్ కాటన్ విత్తనాల అక్రమ రవాణాను అరికట్టేందుకు రాష్ట్ర సరిహద్దుల్లో కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహించాలన్నారు. విత్తనాల సరఫరా వ్యవస్థలో పారదర్శకత పెంచేందుకు లైసెన్సింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని మంత్రి పేర్కొన్నారు. జీవోటీ ఫెయిల్ అయిన పత్తి విత్తనాలను వినియోగానికి అనర్హంగా ప్రకటించి రైతులకు చేరకుండా నిరోధించాలని ఆదేశించారు. కో మార్కెటింగ్ విధానంలో ఏ కంపెనీ విత్తనాన్ని, ఏ కంపెనీ, ఏ పేరుతో అమ్ముతున్నదో తెలియని పరిస్థితి నెలకొన్నదని అన్నారు. విత్తన చట్టంలోని లోపాలను కంపెనీలు అవకాశంగా మార్చుకుని రైతులను మభ్యపెట్టే ప్రయత్నాలను ప్రభుత్వం ఉపేక్షించదని హెచ్చరించారు. అవసరమైతే కో మార్కెటింగ్ పూర్తిగా రద్దు చేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. మట్టి సారాన్ని పెంపొందించే పచ్చిరొట్ట విత్తనాల పంపిణీకి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. వానాకాలం 2026లో 1.95 లక్షల క్వింటాళ్ల విత్తన పంపిణీకి రూ.134 కోట్లు వ్యయం చేయనున్నట్లు వెల్లడించారు. నాణ్యతపై రాజీ లేకుండా, నకిలీ విత్తనాలపై జీరో టాలరెన్స్ విధానం అమలు చేయాలని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, విత్తన కంపెనీలతో సమన్వయం కొనసాగించాలని సూచించారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడం, నకిలీ విత్తనాల నిరోధానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. సమీక్షలో సీడ్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, వ్యవసాయ శాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్ రెడ్డి, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి, వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**మంత్రితో డెవలప్‌మెంట్ ఇన్నోవేషన్ ల్యాబ్ ప్రతినిధుల భేటీ**

డెవలప్‌మెంట్ ఇన్నోవేషన్ ల్యాబ్ ప్రతినిధులు మంత్రి తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని రైతులకు వాతావరణ పరిస్థితులపై సమయానుకూల సలహాలు అందించే దిశగా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ప్రతినిధులు మాట్లాడుతూ ఒడిశా, తెలంగాణతోపాటు పలు రాష్ట్రాలలో పైలట్ ప్రాజెక్టుగా తమ సంస్థ స్వతంత్రంగా పనిచేస్తోందని తెలిపారు. రైతులకు సాగుకు ముందుగానే వాతావరణ పరిస్థితులు, వర్షపాతం వివరాలను ఎస్ఎంఎస్, వాట్సాప్ ద్వారా చేరవేస్తున్నామన్నారు. ఈ సమాచారంతో రైతులు నాట్లు వేయాల్సిన సమయం, పంట కోతలు చేపట్టాల్సిన సమయం, మార్కెట్లో అమ్మకానికి అనుకూలమైన సమయాన్ని ముందుగానే నిర్ణయించుకోగలుగుతున్నారని వివరించారు. అలాగే అకాల వర్షాలు, తుఫానులు, గాలిదుమారాలు వంటి వైపరీత్యాల వల్ల కలిగే పంట నష్టాన్ని తగ్గించేందుకు ఈ విధానం ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు అమలుకు ప్రభుత్వ సహకారం అందించాలని ప్రతినిధులు మంత్రిని కోరారు. దీనిపై సమగ్రంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్‌ను ఆదేశించారు.

**మిల్లర్లతో సమావేశం**

వ్యవసాయ శాఖ కమిషన్ ప్రతినిధులు, యూనివర్సిటీ శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులతో సమావేశమైన మంత్రి తుమ్మల రైస్ మిల్లుల రాష్ట్ర సంఘ ప్రతినిధులతో సమావేశమై మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వరి రకాలపై ఆరా తీశారు. రైస్ మిల్లర్లు మాట్లాడుతూ ప్రభుత్వం సేకరిస్తున్న వడ్లతోపాటు మార్కెట్‌లో ప్రైవేట్ సేకరణకు, ఎగుమతులకు అనువైన రకాల సాగును ప్రోత్సహిస్తున్నందుకు వ్యవసాయ శాఖకు, మంత్రి తుమ్మలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంటీయ□ 1010, కేఎనఎం 118, ఐఆర్ 64 వంటి రకాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్నప్పటికీ ఎగుమతులు మాత్రం ఇంకా పొడవైన గింజలున్న రకాలు పండించే పంజాబ్, హర్యానా రాష్ట్రాల నుంచే అధికంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. అందువల్ల అలాంటి రకాల అభివృద్ధిపై యూనివర్సిటీ శాస్త్రవేత్తలు దృష్టి సారించాలని కోరారు. అదేవిధంగా రాష్ట్రంలో సన్న రకాలుగా పరిగణించే కొన్ని వరి రకాలు ఎఫ్‌సీఏ గ్రేడ్‌లోకి రావడం లేదని, ఆ అంశాన్ని కూడా పరిశీలించాల్సిందిగా మిల్లర్లు అభ్యర్థించారు. యూనివర్సిటీ శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు, సివిల్ సప్లై అధికారుల అభిప్రాయం ప్రకారం ప్రస్తుత వానాకాలానికి ఎంపిక చేసిన ఎనిమిది రకాలలో రెండు రకాలు మిల్లింగ్‌కు అనుకూలంగా లేవని తెలిపారు దీనిపై మంత్రి తుమ్మల స్పందిస్తూ వచ్చే వానాకాలానికి మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వరి రకాల సాగును ప్రోత్సహించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. దీని ద్వారా రైతులకు గిట్టుబాటు ధరలు లభించే అవకాశముందని పేర్కొన్నారు. అలాగే మిల్లర్లు, శాస్త్రవేత్తలు, అధికారులు, ప్రభుత్వం అందరి దృష్టి రైతు సంక్షేమంపై కేంద్రీకృతం కావాలని సూచించారు. అందరి అభిప్రాయాలను సమగ్రంగా పరిశీలించి వరి సన్న రకాల ఎంపికను శాస్త్రీయంగా చేయాలని అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు.

# నిరంతర విద్యుత్ సరఫరా లక్ష్యం

- ఎండలతో డిమాండ్ పెరిగినా లోటు లేకుండా చర్యలు
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**హైదరాబాద్, ఏప్రిల్ 30 (సిరి న్యూస్)**

రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ డిమాండ్ అధికమవుతున్నప్పటికీ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిరంతరాయంగా కరెంట్ సరఫరా చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజా భవన్‌లో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా విద్యుత్ మార్కెట్‌పై ఒత్తిడి ఉన్నప్పటికీ రాష్ట్ర అవసరాలకు లోటు రాకుండా అదనపు విద్యుత్ కొనుగోళ్లు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. అవసరమైతే విద్యుత్ మార్పిడి కేంద్రాల ద్వారా సరఫరా పెంచాలని సూచించారు. ఆసుపత్రులు, తాగునీటి పథకాలు వంటి అత్యవసర సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని పేర్కొన్నారు.

రాష్ట్రంలోని విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించిన మంత్రి, జల విద్యుత్ ఉత్పత్తిని అవసరాలకు అనుగుణంగా సమర్థంగా వినియోగించుకోవాలని తెలిపారు. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు



మరింత పెరిగే అవకాశం ఉన్నందున విద్యుత్ సంస్థలు సమన్వయంతో ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

# తెలంగాణపై కాషాయదళం ఫోకస్

**మొదటిపేజీ తరువాయి**

సందేశం ఇవ్వాలన్నది పార్టీ అధిష్టానం ప్రధాన వ్యూహంగా మారింది.

తెలంగాణలో ఎనిమిది పార్లమెంట్ స్థానాలు గెలుచుకోవడం బీజేపీకి సాధారణ విజయంగా కాకుండా, రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగగలమనే నమ్మకాన్ని పెంచింది. ఈ ఫలితాల ప్రభావం స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ స్పష్టంగా కనిపించింది. కరీంనగర్ కార్పొరేషన్‌ను కైవసం చేసుకోవడం, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అత్యధిక స్థానాలు గెలుచుకోవడం ద్వారా బీజేపీ పట్టణ ఓటర్లతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ తన ప్రభావాన్ని విస్తరించుకుంటోందని తేలింది. గతంలో పరిమిత స్థాయిలో ఉన్న పార్టీ ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో గణనీయ శక్తిగా ఎదుగుతోందన్న భావన బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది.

ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు బీజేపీ తదుపరి వ్యూహానికి కీలకంగా మారాయి. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో అనుకూల ఫలితాలు వస్తే, ప్రాంతీయ పార్టీల బలమైన కోటల్లోనూ విజయం సాధించగలమనే ధీమాతో తెలంగాణలో మరింత దూకుడుగా ముందుకు వెళ్లాలని పార్టీ భావిస్తోంది. బెంగాల్‌లో విజయోత్సాహం తెలంగాణ కేడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని, అదే జోరుతో మిషన్ తెలంగాణను వేగవంతం చేయవచ్చని కమలనాథుల అంచనా. ఈ నేపథ్యంలో ఫలితాల అనంతరం వారం రోజుల్లోనే మోదీ తెలంగాణ పర్యటనకు వచ్చే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు చర్చిస్తున్నాయి.

మోదీ పర్యటనలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు భారీ స్థాయి జనాగ్రహ సభను నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఈ సభను కేవలం రాజకీయ సమావేశంగా కాకుండా, తెలంగాణలో అధికార బీఆర్ఎస్‌పై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని, కాంగ్రెస్‌లో కొనసాగుతున్న అంతర్గత సంక్షోభాన్ని బీజేపీకి అనుకూలంగా మలిచే వ్యూహాత్మక వేదికగా మార్చాలని చూస్తున్నారు. బీఆర్ఎస్‌కు అసలైన ప్రత్యామ్నాయం బీజేపీనే అన్న సందేశాన్ని ప్రజల్లో బలంగా నాటేందుకు మోదీ వేదికను వినియోగించే అవకాశం ఉంది. అదే సమయంలో కాంగ్రెస్‌ను కూడా ప్రత్యక్ష రాజకీయ పోటీలోకి లాగుతూ ద్విముఖ పోరాటానికి రంగం సిద్ధం చేయాలన్నది కాషాయ వ్యూహంగా కనిపిస్తోంది.

మోదీ సభ అనంతరం రాష్ట్రవ్యాప్తంగా భారీ చేరికలకు కూడా బీజేపీ ప్రణాళిక రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇతర పార్టీల్లో అసంతృప్తిగా ఉన్న నేతలను ఆకర్షించేందుకు ఈ సభను రాజకీయ ముహూర్తంగా మార్చే యోచనలో పార్టీ ఉంది. ముఖ్యంగా స్థానిక స్థాయిలో బలమైన నాయకత్వాన్ని పెంచుకోవడం, కేడర్‌ను మరింత చురుకుగా మార్చడం, వచ్చే ఎన్నికల దిశగా బలమైన భూకంపం సృష్టించడం బీజేపీ ప్రధాన లక్ష్యాలుగా కనిపిస్తున్నాయి.



బెంగాల్ ఫలితాలు అనుకూలిస్తే తెలంగాణలో బీజేపీ రెండో గేర్‌లోకి వెళ్లడం ఖాయమనే అంచనాలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. మే తొలి వారంలో జరిగే పరిణామాలు తెలంగాణ రాజకీయాల దిశను ప్రభావితం చేసే అవకాశముంది. మోదీ జనాగ్రహ సభ తర్వాత రాష్ట్ర రాజకీయాలు బీఆర్ఎస్ వర్సెస్ బీజేపీగా మారుతాయా? లేక కాంగ్రెస్ కూడా తన స్థాయిని నిలబెట్టుకుంటుందా? అన్నది రాబోయే రోజుల్లో స్పష్టమవుతుంది. అయితే ఒక విషయం మాత్రం స్పష్టం—తెలంగాణపై కాషాయదళం చూపు ఇప్పుడు మరింత గట్టిగానే పడింది.




# విమర్శలు కాదు.. ఫలితాలే ప్రమాణం

- చరిత్ర సృష్టించిన సంక్షేమ గురుకులాలు
- 99.12% రికార్డుతో కార్పొరేట్ సంస్థలను అధిగమించిన విద్యార్థులు
- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**హైదరాబాద్, ఏప్రిల్ 30 (సిరి న్యూస్):**

రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థలు విద్యారంగంలో మరో అద్భుతాన్ని ఆవిష్కరించాయి. 2026 పదవ తరగతి ఫలితాల్లో ఏకంగా 99.12 శాతం ఉత్తీర్ణత సాధించి చరిత్ర సృష్టించాయి. "ప్రతిపక్షాల విమర్శలు కాదు, మా విద్యార్థులు సాధించిన విజయలే మా ప్రభుత్వ పనితీరుకు గీటురాయి" అని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గురుకుల విద్యాసంస్థలు నూతన దిశగా అడుగులు వేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. 2026 పదవ తరగతి ఫలితాల్లో ఏకంగా 99.12 శాతం ఉత్తీర్ణత సాధించి చరిత్ర సృష్టించాయి. "ప్రతిపక్షాల విమర్శలు కాదు, మా విద్యార్థులు సాధించిన విజయలే మా ప్రభుత్వ పనితీరుకు గీటురాయి" అని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గురుకుల విద్యాసంస్థలు నూతన దిశగా అడుగులు వేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. గురువారం డి.ఎస్.ఎస్. భవన్లో జరిగిన సమావేశంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఫలితాలను వెల్లడించారు. 40 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా 99.12 శాతం ఉత్తీర్ణత నమోదు కావడం వెనుక ప్రభుత్వ వ్యూహాత్మక సంస్కరణలు ఉన్నాయని ఆయన తెలిపారు. పదవ తరగతి 17,071 మంది పరీక్ష రాయగా, 16,921 మంది ఉత్తీర్ణులయ్యారు.

100% ఉత్తీర్ణత: 235 పాఠశాలల్లో 163 పాఠశాలలు 100 శాతం ఫలితాలను సాధించాయి. తొమ్మిది జిల్లాల్లోని అన్ని గురుకులాలు వంద శాతం ఉత్తీర్ణతతో సత్తా చాటాయి. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 88.22%, ప్రథమ సంవత్సరంలో 77.79% ఉత్తీర్ణత నమోదైంది. జేఈఈ మెయిన్స్లో 441 మంది అర్హత సాధించగా, 35 మంది 90 పర్సెంటైల్ పైగా స్కోర్ చేశారు. ఐఐటీ, నీట్ లోనూ గురుకుల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. ఈ అద్భుత విజయాల వెనుక 'స్టూడెంట్ సెంట్రిక్' విధానం ఉందని మంత్రి వెల్లడించారు. ఒక్క విద్యార్థి కూడా వెనుకబడకూడదు అనే లక్ష్యంతో ట్రాకింగ్ వ్యవస్థను, రోజువారీ బోధనతోపాటు సాయంత్రం డౌట్ క్లారిఫికేషన్ సెషన్లను అమలు చేశామన్నారు. టీచర్లు విద్యార్థులను తమ సొంత పిల్లలుగా భావించి, 24 గంటలు అందుబాటులో ఉండి బోధించడం వల్లనే ఇది సాధ్యమైందని ఆయన ప్రశంసించారు.

## జవాబుదారీతనం పెంచేందుకే 'సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్'

**మొదటిపేజీ తరువాయి**



సకాలంలో అందితే విద్యార్థులు చదువుపై పూర్తిస్థాయిలో శ్రద్ధ చూపుతారని అన్నారు. విద్యా శాఖతో పాటు బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖలు, ఎస్సీ అభివృద్ధి శాఖల పరిధిలోని విద్యాసంస్థల్లోని విద్యార్థులకు అందజేసే సామగ్రి సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌పై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. గతంలో దుస్తులు, నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, ఇతర సామగ్రి సరఫరాకు సంబంధించి ఏ శాఖకు ఆ శాఖ చేపట్టడంతో అవకతవకలకు ఆస్కారం ఉండేదన్నారు. అటువంటి అవకతవకలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని సీఎం స్పష్టం చేశారు. వాటిని అరికట్టేందుకు సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని తీసుకొచ్చామని తెలిపారు. ఈ విధానంతో జవాబుదారీతనం పెరుగుతుందని అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రయత్నం చేస్తున్నదని, సరఫరాదారుల ప్రయోజనాలు కాపాడేందుకు కాదని అన్నారు. విద్యార్థులకు అందజేసే నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు, ట్రాక్ షూట్లు, బెడ్ షీట్లు, స్కూల్ బ్యాగ్లు, ఐడీ కార్డులు, యూనిఫాంలు అన్నీ నాణ్యమైనవే ఉండాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నాణ్యతతోపాటు సకాలంలో అందడంపైనా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జూన్ 15 నాటికి విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా అందాలని, అలా అందగానే సరఫరాదారులకు చెల్లింపులు పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. విద్యార్థులకు అందజేసే వస్తువులకు సంబంధించి మండల స్థాయిలో ఒక నోడల్ అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. అక్కడినుంచి క్షేత్రస్థాయిలో గ్రామాల్లోని పాఠశాలలు, హాస్టళ్లకు వస్తువులు సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని, సరఫరాకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీయించాలన్నారు. ప్రతి విద్యార్థికి వారికి అవసరమైన సామగ్రి అంతా అందిందా లేదా అనే దానిని చెక్ చేసుకోవాలని సీఎం ఆదేశించారు. నోటు పుస్తకాలు, యూనిఫాం, ఇతర సామగ్రి క్వాలిటీ వాటిని అందుకున్న తర్వాత వారి భావాలను తెలియజేసేందుకు విద్యార్థుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని సీఎం సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, విద్యాశాఖల మధ్య సమన్వయానికి ఒక కమిటీని నియమించాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాల మాయాదేవి, సెర్ప్ సీఈవో దివ్య, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి సంతోష్, టీజీ బీసీడబ్ల్యూఆరఐఈఎస్ కార్యదర్శి బి.సైదులు తదితరులు పాల్గొన్నారు.

## కవిత పార్టీ పేరు తెలంగాణ రక్షణ సేన

**హైదరాబాద్, ఏప్రిల్ 30 (సిరి న్యూస్):**

కల్వకుంట్ల కవిత పార్టీ తెలంగాణ రక్షణ సేన( టీఆర్ఎస్) పేరును కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదించింది. ఆమె పెట్టుకున్న పేర్లలో ఈ పేరును ఖరారు చేసింది. దీనిపై కవిత హర్షం వ్యక్తం చేశారు. 'ఈసీ నిబంధనలకు అనుగుణంగా జనవరిలో మొత్తం ఐదు పేర్లతో దరఖాస్తు చేసుకున్నాం.. మూడో ప్రాధాన్యంగా ఇచ్చిన పేరును ఈసీ ఆమోదించింది.. టీఆరఎస్.. నాకు రాసిపెట్టి ఉందేమో.. రెండు దశాబ్దాలుగా తెలంగాణ సాంస్కృతిక పరిరక్షణ, పునరుజ్జీవం కోసం చేస్తున్న కృషిని కొనసాగిస్తా.. రాష్ట్ర అస్తిత్వ పరిరక్షణే ధ్యేయంగా అంకితభావంతో పనిచేస్తా' అని కవిత 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. ఈ నెల 25న కవిత ప్రకటించిన రాజకీయ పార్టీ తెలంగాణ రాష్ట్ర సేన బదులు తెలంగాణ రక్షణ సేన పేరును ఆమోదించింది. టీఆర్ఎస్ పార్టీకి అనుమతిస్తూ బంజారాహిల్స్‌లోని కవిత నివాసంలో ఎన్నికల సంఘం అధికారులు ఆమెకు లేఖ అందజేశారు. పార్టీ పేరుపై పత్రికల్లో ప్రకటన ఇవ్వాలని కవితకు ఈసీ సూచించింది. అదేవిధంగా కొత్త పార్టీ పేరుపై అభ్యంతరాలుంటే 30 రోజుల్లోపు తమ దృష్టికి తీసుకురావాలని తెలిపింది.

## సంపాదకీయం

# ప్రజా తీర్పుపై ఉత్కంఠ..!




భారత ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రక్రియ ముగియగానే అందరి కళ్ళు ఎగ్జిట్ పోల్స్ వైపు మళ్ళుతాయి. తాజాగా ఏప్రిల్ 2026లో పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వెలువడ్డాయి. ఈ అంచనాలు కొన్ని రాష్ట్రాల్లో స్పష్టమైన ఆధిక్యాన్ని చూపుతుండగా, మరికొన్ని చోట్ల హోరాహోరీ పోరును సూచిస్తున్నాయి. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), బీజేపీ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. మెజారిటీ సంస్థలు మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీకి స్వల్ప ఆధిక్యాన్ని ఇస్తుండగా, బీజేపీ కూడా బలమైన పోటీని ఇస్తోంది. తమిళనాడులో అధికార డిఎంకె కూటమి మరోసారి తన పట్టును నిలబెట్టుకుంటుందని మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ అంచనా వేస్తున్నాయి. అయితే నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కజగం (టీవీకె) దాదాపు 15 శాతం ఓట్ల వాటాతో అనూహ్యమైన ప్రభావాన్ని చూపే అవకాశం ఉందని సర్వేలు పేర్కొన్నాయి. ఇక కేరళలో ఇక్కడ ఎల్డీఎఫ్, యూడీఎఫ్ మధ్య 'ఫోటో ఫినిష్' పోరు సాగే అవకాశం ఉంది. ఎడమ పక్షాల వరుస మూడో విజయంపై సందిగ్ధత నెలకొంది. అలాగే అస్సాంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి అస్సాంలో సులభంగా అధికారాన్ని నిలబెట్టుకుంటుందని సర్వేలు ఏకగ్రీవంగా చెబుతున్నాయి. చివరిగా పుదుచ్చేరిలో సైతం ఎన్డీఏ కూటమికి అనుకూల పవనాలు వీస్తున్నట్లు అంచనాలు ఉన్నాయి.

### కొత్త శక్తుల ఆవిర్భావం

ఈ ఎన్నికల్లో ప్రాంతీయ స్థాయిలో సరికొత్త రాజకీయ శక్తులు వెలుగులోకి రావచ్చు. తమిళనాడులో నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకె ఓట్ల శాతం పెరిగితే, అది ద్రవిడ రాజకీయాల్లో మూడో ప్రత్యామ్నాయానికి దారితీస్తుంది. కేరళలో ఎల్డీఎఫ్ వరుసగా మూడోసారి అధికారంలోకి వస్తే, అది కేరళ రాజకీయ చరిత్రలో ఒక సరికొత్త రికార్డుగా మారుతుంది. ఎన్నికల ఫలితాల తర్వాత అన్ని పార్టీలు 'వెల్ఫేర్ పాలిటిక్స్' (సంక్షేమ రాజకీయాలు) పై మరింత దృష్టి పెట్టే అవకాశం ఉంది. ఓటర్లను ఆకర్షించిన ఉచిత పథకాలు లేదా గ్యారంటీ పథకాలను ఇతర రాష్ట్రాల్లోనూ అమలు చేసేలా ఒత్తిడి పెరుగుతుంది. ఈ ఐదు రాష్ట్రాల ఫలితాలు రాబోయే కాలంలో జరగనున్న ఇతర రాష్ట్రాల ఎన్నికలకు, కేంద్ర ప్రభుత్వ విధాన నిర్ణయాలకు దిక్సూచిగా మారతాయి. ముఖ్యంగా నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) వంటి అంశాలపై దక్షిణాది రాష్ట్రాల గళం మరింత బలంగా వినిపించే అవకాశం ఉంది.


### బెంగాల్ ఫలితాలు అగ్ని పరీక్షే...

పశ్చిమ బెంగాల్ ఈ సారి మరింత ప్రత్యేకమని చెప్పొచ్చు. జరిగిన ఎన్నికల్లో బెంగాల్ వర్సెస్ బంగ్లాదేశ్ చొరబాటుదారులు అన్నట్టు ప్రజల్లోకి బీజేపీ ఒక స్లోగన్ తీసుకెళ్లగలిగింది. ఎప్పుడు అల్లర్లు జరిగే కొన్ని ప్రదేశాల్లో స్వేచ్ఛగా ఓట్లు వేసే అవకాశం ఈ సారి బెంగాల్ ప్రజలకు ఎలక్షన్ కమిషన్ ఇచ్చింది. కేంద్ర బలగాలు ఎన్నడూ లేనంత బెంగాల్ లోనే ఉండేలా చర్యలు తీసుకుంది. ఇది బీజేపీ తనకు అనుకూలమయ్యే అవకాశం అన్న అంచనాలో ఉంది. ఇక సర్ తో లక్షలాది ఓట్లు తొలగించారంటూ ప్రస్తుత ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చేసిన హంగామా అంతా ఇంతా కాదు. ఒక సభలో గెలిస్తే మళ్లి కలుద్దాం అంటూ ఆమె సభనుండి వెళ్ళిపోయిన వీడియో ఒక సంచలనమే అయ్యింది. ఇది ఓటమి భయంతో దీదీ ఆలా చేసిందని బీజేపీ చెబితే, ప్రజలకు మూడు పర్యాయాలు ఆమె చేసిన సేవను గుర్తుచేయడానికి చేసిన ప్రయత్నమని తృణమూల్ నేతలు వాదిస్తున్నారు. ఏది ఏమైనా ఈ ఎన్నికల్లో బీజేపీకి తృణమూల్ కు బెంగాల్ ఫలితాలు ఒక అగ్ని పరీక్షే అని చెప్పొచ్చు.

### ఎగ్జిట్ పోల్స్ – విశ్వసనీయత ఎంత?

ఎగ్జిట్ పోల్స్ అనేవి ఓటర్ల నాడిని పట్టుకునే ప్రయత్నమే తప్ప తుది తీర్పు కాదు. గతంలో 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో ఎగ్జిట్ పోల్స్ అంచనాలు ఘోరంగా తప్పిన ఉదాహరణలు ఉన్నాయి. సామాజిక సమీకరణాలు, తటస్థ ఓటర్ల ప్రభావం, క్షేత్రస్థాయిలో ఉండే నిశ్శబ్ద తరంగాన్ని అంచనా వేయడంలో సర్వేలు కొన్నిసార్లు విఫలం కావచ్చు. ఎగ్జిట్ పోల్స్ రాజకీయ పార్టీలలో ఉత్సాహాన్ని లేదా ఆందోళనను నింపవచ్చు, కానీ అసలైన ప్రజా తీర్పు మే 4న వెలువడనుంది. అప్పటి వరకు ఈ అంచనాలు కేవలం చర్చలకు ప్రాతిపదిక మాత్రమే. ప్రజలు ఎవరికి పట్టం కట్టారో తెలుసుకోవాలంటే కౌంటింగ్ రోజు వరకు వేచి చూడాల్సిందే.

# కొక్కిరాల విశ్వప్రసాద్ మాతృమూర్తికి ఘన నివాళి



**ఆదిలాబాద్(సిరి న్యూస్ ):** కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు కొక్కిరాల విశ్వప్రసాద్ మాతృమూర్తి పెద్దకర్మ కార్యక్రమాన్ని గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. విశ్వప్రసాద్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్, ఆదిలాబాద్ డీసీసీ వైస్ ప్రెసిడెంట్ బ్రిజ్ లాల్ కర్మన్కర్, జనరల్ సెక్రటరీ బానోత్ ప్రణీత సూరజ్ సింగ్, మాజీ ఎంపీటీసీ, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పరమేశ్వర్, జిల్లా స్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతు గోస తగులుతుంది

- కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల కన్నీరు
- కేంద్రం నిధులిస్తున్నా రాష్ట్రం ఎందుకు కొనడం లేదు?
- మిల్లర్లు, దళారుల కుమ్మక్కుపై చర్యలు తీసుకోవాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

**యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 30 (సిరి న్యూస్):**



కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత, నిర్లక్ష్య వైఖరి వల్ల ధాన్యం కొనుగోలు వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిందని బీజేపీ¾ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అన్నదాతలు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం హన్మాపూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బీజేపీ కిసాన్ మోర్చా నాయకులతో కలిసి ఆయన గురువారం పరిశీలించి రైతుల కష్టాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు తమ ఆవేదనను వెళ్ల_బోసుకుంటూ పది రోజులుగా లారీలు రాక, కాంటాలు లేక, కనీసం టార్పాలిన్లు కూడా లేకపోవడంతో ధాన్యం కుప్పలు మొలకెత్తుతున్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మీడియా సమావేశంలో రామచందర్ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయంటే నల్లగొండ జిల్లా బచ్చన్నగూడెం ఐకేపీ సెంటర్ ఇన్‌చార్జి కొప్పుల సైదులు మిల్లర్ల వేధింపులు, ప్రభుత్వ ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యాయత్నం చేయాల్సి వచ్చిందని, తన ప్రాణ త్యాగంతో అయినా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిచి కొనుగోళ్లు సజావుగా సాగాలని ఆయన మాట్లాడి అనంతరం ఆత్మహత్యాయత్నం చేయడం ప్రతి ఒక్కరినీ కలచివేసిందని అన్నారు. రైతులు ఎవరూ అధైర్యపడవద్దని, ఆత్మహత్యలు చేసుకోవద్దని, మోదీ ప్రభుత్వం, బీజేపీ మీకు అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మొద్దునిద్ర వీడి మొలకెత్తిన ప్రతీ గింజను కొనుగోలు చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ వంటి కనీస సదుపాయాలు కల్పించాలని, లారీలు, గన్నీ బ్యాగుల కొరతను వెంటనే తీర్చాలని రామచందర్ రావు డిమాండ్ చేశారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తక్షణమే స్పందించి రైతులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

**కేంద్రం నిధులిస్తున్నా తాత్సారం ఎందుకో?**

ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి మద్దతు ధరతో పాటు ట్రాన్స్‌పోర్టు, గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, హమాలీ చార్జీలు, చివరికి ఐకేపీ సెంటర్ల కమీషన్ కూడా కేంద్ర ప్రభుత్వమే చెల్లిస్తోంది. అయినప్పటికీ కొనుగోళ్లు జరపడానికి రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చిన అడ్డంకి ఏంటి అని ప్రశ్నించారు. వరంగల్ రైతు డిక్లరేషన్ పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన హామీలేవీ నెరవేర్చలేదని విమర్శించారు. కనీసం టార్పాలిన్లు ఇవ్వకపోవడంతో ధాన్యం మొలకెత్తి బరువు తగ్గిపోతోందని, దీనివల్ల రైతుకు గిట్టుబాటు ధర దక్కకుండా పోతోందని మండిపడ్డారు. హన్మాపూర్‌లో 80 100కి పైగా ధాన్యం రాశులుగా పోసి రైతులు వేచి చూస్తున్నప్పటికీ కొనుగోళ్ల విషయంలో అధికారులు కేవలం మాటలతో సరిపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**మిల్లర్లు – దళారుల కుమ్మక్కు**

రైస్ మిల్లర్లు, దళారులు, కొంతమంది అధికారులు కుమ్మక్కై రైతులకు అన్యాయం చేస్తున్నారని రామచందర్ రావు ఆరోపించారు. ఆదిలాబాద్‌లో మక్క రైతుల పరిస్థితి కూడా దారుణంగా ఉందని, మద్దతు ధర దేవుడెరుగు కనీసం కొనేనాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పుడు చర్యలకు పాల్పడుతున్న మిల్లర్లపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

# దేశానికే ఆదర్శంగా అక్రిడిటేషన్ల జారీ

- సంఖ్య తేలితే జర్నలిస్టులకు మరిన్ని సౌకర్యాల కల్పన
- 10లోగా దరఖాస్తు చేసుకున్న వారందరికీ అక్రిడిటేషన్లు
- 1న అన్ని జిల్లాల్లో అక్రిడిటేషన్ల పంపిణీకి కలెక్టర్లకు ఆదేశం
- 15వరకు అందరికీ బస్సు పాస్‌ల పొడిగింపు
- సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, ఏప్రిల్ 30 (సిరి న్యూస్) :**

రాష్ట్రంలో అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని సమాచార, పౌరసంబంధాలు, రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు పాత్రికేయులకు ఆరోగ్యంతోపాటు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు. సమాచార శాఖ ఆధ్వర్యాన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులను మంత్రి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన అక్రిడిటేషన్ కార్డులను ఇంతవరకు పొడిగించామని, దేశంలో, ఇతర రాష్ట్రాలలో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను ఇక్కడ అనుసరించాలన్న ఆలోచన మేరకు పరిశీలన సాగిందని, అందువల్లే ఈ కార్డుల జారీలో ఆలస్యం చోటుచేసుకుందని చెప్పారు. గత ప్రభుత్వం 32,500 మందికి అక్రిడిటేషన్లు ఇచ్చే అవకాశం ఉన్నా 23,352కే పరిమితం చేసిందన్నారు. తమ ప్రభుత్వం ఇప్పుడు 46 వేల మందికిపైగా అక్రిడిటేషన్లు ఇచ్చేలా మార్పులు చేసిందని, ఇప్పటికే సుమారు 2,800 వరకు కార్డులను ఆమోదించామని వివరించారు. జర్నలిస్టుల సూచనల మేరకు జీవోలలో మార్పులుచేర్పులు చేశామని, అర్హులైన జర్నలిస్టులకు కార్డుల మంజూరులో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని అన్నారు. మే 1న అన్ని జిల్లాల్లో అక్రిడిటేషన్ కార్డులు పంపిణీ చేయాలంటూ కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. ఈ ప్రక్రియలో మే 10ని ఒక కటాఫ్ డేట్‌గా పెట్టుకుని దరఖాస్తులు చేసుకోవాలని, ఆ తేదీలోగా వచ్చే దరఖాస్తులను ఆమోదిస్తామని తెలిపారు. రాష్ట్రంలో అక్రిడిటేషను సంఖ్య తేలితే జర్నలిస్టులకు ఆరోగ్యం, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు ఒక ప్రణాళిక రూపొందించుకోవచ్చునన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ దిశగా పలు సూచనలు చేశారని వెల్లడించారు. అంతేగాక జర్నలిస్టులు వివిధ సంస్థలలో ఉద్యోగాలు మారినప్పటికీ అక్రిడిటేషన్ల మంజూరు ఓ నిరంతర ప్రక్రియగా సాగుతుందని, ఈ విషయంలో ఎలాంటి సందేహాలు వద్దని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని, త్వరలో పాత్రికేయ సంఘాలతో భేటీ అవుతామని తెలిపారు. ఏప్రిల్ 30తో కొంతమంది జర్నలిస్టుల బస్సు పాస్‌ల గడువు ముగుస్తున్నందున మరో 15 రోజులపాటు పొడిగించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డులను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 19 పేజీల డెత్ నోట్

- కన్నీళ్లు పెట్టించే నిజాలు
- సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య కేసులో సంచలనం
- తన ఆత్మహత్యకు భార్య కారణమని సూసైడ్ నోట్ రాసిన సీతారామ్

**హైదరాబాద్, ఏప్రిల్ 30 (సిరి న్యూస్) :**

హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సీతారామ్ రెడ్డి ఆత్మహత్య ఉదంతం ఇప్పుడు పెను సంచలనంగా మారింది. తన కుమారుడి మరణానికి కోడలి వివాహేతర సంబంధమే కారణమంటూ మృతుడి తండ్రి చేస్తున్న ఆరోపణలు నగరంలో చర్చనీయాంశమయ్యాయి. నగరంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సీతారామ్ రెడ్డి ఆత్మహత్య కేసు కొత్త మలుపు తిరిగింది. ఫిబ్రవరి మొదటి వారంలో హుస్సేన్ సాగర్‌లో దూకి ప్రాణాలు తీసుకున్న సీతారామ్ రెడ్డి మరణంపై ఆయన తండ్రి తాజాగా సంచలన ఆరోపణలు చేశారు. తన కుమారుడి మరణానికి కోడలు రేణుకకు ఉన్న వివాహేతర సంబంధాలే కారణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

19 పేజీల డెత్ నోట్, కన్నీళ్లు పెట్టించే నిజాలు : సీతారామ్ రెడ్డి ఆత్మహత్యకు ముందు రాసిన 19 పేజీల సూసైడ్ నోట్ ఇప్పుడు ఈ కేసులో కీలకంగా మారింది. తన చావుకు భార్య రేణుక ప్రవర్తనే కారణమని ఆయన ఆ లేఖలో స్పష్టంగా పేర్కొన్నట్లు తెలుస్తోంది. భార్య వేధింపులు, ఆమె పరాయి వ్యక్తులతో కొనసాగిస్తున్న సంబంధాల వల్ల తలెత్తిన మనస్తాపంతోనే తాను ఈ కఠిన నిర్ణయం తీసుకుంటున్నట్లు సీతారామ్ రెడ్డి ఆవేదన చెందినట్లు సమాచారం.

నా కుమారుడు కృంగిపోయాడు : మృతుడి తండ్రి వేంకటేశ్వర రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కన్నీటి పర్యంతమయ్యారు. "నా కొడుకు ఎంతో కష్టపడి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఎదిగాడు. కానీ భార్య మోసం చేయడంతో మానసికంగా కృంగిపోయాడు. 19 పేజీల లేఖలో తన బాధనంతా వివరించాడు" అని పేర్కొన్నారు. సీతారామ్ రెడ్డి భార్య రేణుకను ఉరిశిక్ష వేయాలని, ఆమెతో వివాహేతర సంబంధం పెట్టుకుని, ఈ ఆత్మహత్యకు ప్రేరేపించిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# యాదాద్రిలో నర్సింహ స్వామి జయంతి ఉత్సవాలు

**యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 30 (సిరి న్యూస్):**

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో నృసింహ స్వామి జ యంతి ముగింపు ఉత్సవాలు కొనసాగుతు న్నాయి. లక్ష్మీ నరసింహస్వామి వారి అలం కరణ సేవను గురువారం ఉదయం ఊరే గింపు చేపట్టారు. యాగశాలలోని ప్రత్యేక వేదికపై అధిష్టింప జేశారు. ద్వార తోరణ, మూర్తి కుంభారాధన, చతుఃస్థానార్చన లక్ష్మీ నృసింహ, సుదర్శన, గరుడ మూలమంత్ర హోమాలను శాస్త్రోక్తగా జరిపారు. అనంతరం ద్వారకోరణ మాషబలి మహా పూర్ణాహుని చేపట్టి ఏకోత్తర సహస్ర కలశావీషేకము సహస్ర ఘటాభిషేక వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు అర్చన, తదుపరి వేదస్వస్తి, నృసింహ అవిర్భావం. ఋత్విక్ సన్మానం మహానివేధన, తీర్థ ప్రసాద గోష్ఠి ఉత్సవ పరిసమాప్తి చేపట్టనున్నారు. అనుబంధ పాతగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవాలయం, దబగుంటుపల్లి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో నృసింహ జయంతి ఉత్సవాల సందర్భంగా ముగింపు ఉత్సవాలు కొనసాగుతున్నాయి. కార్య క్రమంలో ఆలయ అనువంశిక ధర్మక ర్త బీ.నరసింహమూర్తి, ఈవో భవాని శంకర్, డీఈవో నవీన్ పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# యువ పోలీసుల చేతుల్లోనే పోలీస్ శాఖ ప్రతిష్ఠ

- ఫ్రెండ్లీ పోలీసింగ్ ప్రస్తుతం అత్యంత కీలకం
- కొత్త డీజీపీ సీవీ ఆనంద్ కు అభినందనలు
- వీడ్కోలు సన్మానంలో డీజీపీ శివధర్ రెడ్డి

**హైదరాబాద్, (సిరి న్యూస్) ఏప్రిల్ 30:**

రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డికి పోలీస్ అకాడమీలో ఘనమైన వీడ్కోలు లభించింది. గురువారం ఆయన రిటైర్ అవుతున్న సందర్భంగా పోలీస్ అధికారులు ఆయనకు గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా శివధర్ రెడ్డి మాట్లాడుతూ తన 32 ఏళ్ల సుదీర్ఘకాలంలో ఎన్నో అనుభవాలు, అనుభూతులు మిగిలాయన్నారు. వృత్తిలో భాగంగా పలు సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. పోలీసింగ్ విధానంలో ప్రస్తుతం అనేక మార్పులు చోటుచేసుకున్నాయని, యువ పోలీస్ అధికారులు డిపార్ట్మెంట్ కు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పోలీస్ విభాగం పీపుల్స్ ఫ్రెండ్లీ పోలీసింగ్తో ముందుకు వెళ్లాలని సూచించారు. సర్వీసులో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాగా, పదవీ విరమణ పొందిన శివధర్ రెడ్డికి నూతన డీజీపీగా నియామకమైన సీవీ ఆనంద్ అభినందనలు తెలిపారు. ఆయన ఉద్యోగ జీవితంలో ఎన్నో సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని పలు సంస్కరణలు తీసుకొచ్చారని ప్రశంసించారు. ఆయన సూచనలు, సలహాలు తీసుకునేందుకు తాను సిద్ధమేనని ఆనంద్ తెలిపారు.

**పోలీసు సారథికి ఆత్మీయ వీడ్కోలు**

డీజీపీగా గురువారం పదవీ విరమణ చేసిన బి. శివధర్ రెడ్డికి రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయం వేదికగా నిర్వహించిన వీడ్కోలు వేడుక అత్యంత ఘనంగా, ఆత్మీయతతో కూడిన వాతావరణంలో సాగింది. సుదీర్ఘ కాలంపాటు పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి తనదైన ముద్ర వేసిన శివధర్ రెడ్డి నిష్క్రమణ సమయంలో సహచర అధికారులు, సిబ్బంది భావోద్వేగానికి లోనయ్యారు. కార్యక్రమ ఆరంభంలో శివధర్ రెడ్డి తన బాధ్యతలను శాంతిభద్రతల డీజీపీ మహేష్ ఎం.భగవత్‌కు అప్పగించారు. నూతన డీజీపీగా సి.వి. ఆనంద్ బాధ్యతలు స్వీకరించే వరకు ఇన్‌చార్జి డీజీపీగా మహేష్ భగవత్ వ్యవహరించనున్నారు. అధికారిక బదిలీ ప్రక్రియ అనంతరం వీడ్కోలు పలికేందుకు తరలివచ్చిన ఐపీఎస్ అధికారులు, సిబ్బందికి అభివాదం చేస్తూ తనను కలిసేందుకు వచ్చిన వారితో కరచాలనం చేస్తూ, ఆత్మీయంగా పలకరిస్తూ శివధర్ రెడ్డి ముందుకు సాగారు. అనంతరం పూలతో అలంకరించిన వాహనంపై నిలబడి అందరికీ అభివాదం చేశారు. పోలీసు సంప్రదాయంలో అత్యంత గౌరవప్రదమైన రీతిలో ఐపీఎస్ అధికారులు తాళ్లతో ఆ వాహనాన్ని లాగుతుండగా ఇతర సిబ్బంది డీజీపీపై పూలు చల్లుతూ కార్యాలయ ప్రధాన ద్వారం వరకు సాగనంపారు. ఉన్నతాధికారుల నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ తమ ప్రియతమ అధికారికి వీడ్కోలు పలుకుతుంటే ఆ ప్రాంగణం మొత్తం భావోద్వేగంతో నిండిపోయింది. టీజీసీఎస్బీ డైరెక్టర్ శిఖా గోయల్, జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా, శాంతిభద్రతల డీజీపీ మహేష్ ఎం.భగవత్, టీఎసఎలీల్బీఆర్బీ చైర్మన్ వి.వి.శ్రీనివాసరావు, ఎస్పీఎఫ్ డీజీ స్వాతి లక్రా, ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీ విజయ కుమార్‌లతో పాటు పలువురు ఐపీఎస్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆయనకు సాదర వీడ్కోలు పలికారు. చివరగా ప్రధాన గేటు వద్దకు చేరుకున్న శివధర్ రెడ్డి అందరి కృతజ్ఞతలను స్వీకరిస్తూ తన వాహనంలో వెళ్లారు.

**భద్రతా సలహాదారుగా శివధర్ రెడ్డి నియామకం**

**హైదరాబాద్, ఏప్రిల్ 30 :**

తెలంగాణ డీజీపీగా పదవీ విరమణ పొందిన బి శివధర్ రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వ భద్రతా సలహాదారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన అనుభవాన్ని రాష్ట్రానికి వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

చీఫ్ సెక్రటరీ స్థాయి హోదాతో ఈ బాధ్యతలు అప్పగించిన శివధర్ రెడ్డి, బాధ్యతలు చేపట్టిన తేదీ నుంచి మూడు సంవత్సరాలపాటు పదవిలో కొనసాగనున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, అంతర్గత భద్రత, నేర నియంత్రణ అంశాలపై ప్రభుత్వానికి సలహాలు అందించనున్నారు.

మత్తు పదార్థాల వినియోగం నియంత్రణ, రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. నేరాల స్వరూపం మారుతున్న నేపథ్యంలో సమర్థవంతమైన వ్యూహాల రూపకల్పనలో ఆయన పాత్ర కీలకంగా ఉండనుందని అధికారులు తెలిపారు. వేతనంగా నెలకు రూ.2.25 లక్షలు, ఇంటి అద్దె భత్యంగా రూ.50 వేలు అందనుండగా, ప్రభుత్వ వాహనం, ప్రయాణ భత్యాలు, వైద్య సౌకర్యాలు కూడా కల్పించనున్నారు. అధికారిక విధుల నిర్వహణ కోసం ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేసి, ఓఎస్‌డీ, ప్రైవేట్ కార్యదర్శి, డ్రైవర్లు, సహాయక సిబ్బందితో కూడిన బృందాన్ని అందుబాటులో ఉంచనున్నారు.

డీజీపీగా సేవలందించిన అనుభవాన్ని కొనసాగిస్తూ భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు భావిస్తున్నారు.

# టోల్ ప్లాజా చుట్టూ నిర్లక్ష్యం రాజ్యం... ప్రతి అడుగు ప్రమాదమే!

- వంగిన విద్యుత్ స్తంభాలు... ఎప్పుడైనా కూలే ముప్పు
- సర్వీస్ రోడ్ల దుస్థితి... ద్విచక్ర వాహనదారులకు ప్రమాదాల పాలు
- స్పీడ్ నియంత్రణ లేక టోల్ వద్ద అతివేగ దూకుడు
- 1906 ఫిర్యాదులు చేసినా స్పందన శూన్యం
- అండర్‌బ్రిడ్జ్ వద్ద మిర్రర్ లేక బ్లైండ్ స్పాట్ ప్రమాదాలు

**మునిపల్లి (సిరి న్యూస్)**

### స్తంభాలు ఇంకా ఎంత వంగితే పట్టించుకుంటారు?

కంకల్ టోల్ ప్లాజా సమీపంలోని ముగ్దుంపల్లి–లింగంపల్లి జాతీయ రహదారి ఇరువైపులా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు తీవ్రంగా వంగిపోవడంతో ఎప్పుడైనా ప్రమాదం సంభవించే పరిస్థితి నెలకొంది. రోజంతా భారీ వాహనాల రాకపోకల మధ్య ఈ స్తంభాలు మరింత క్షీణించి నిలబడలేని స్థితికి చేరుతున్నాయి.కొన్ని చోట్ల స్తంభాల అడుగుభాగం తేలడంతో వాహనదారులకు అడ్డుగా మారుతోంది. రాత్రి వేళల్లో లైట్లు సరిగా వెలగకపోవడం వల్ల అడుగు భాగం కనిపించక, ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికే కొన్ని స్తంభాలపై ఉన్న లైట్లు పనిచేయకుండా ఉండటంతో చీకటి మరింత పెరిగింది. వంగిన స్తంభాలు ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం పొంచి ఉంది అని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



దారి చూసుకోకుంటే దౌఖానాకే!



టోల్ ప్లాజాకు ఇరువైపులా ఉన్న ద్విచక్ర వాహనాల కోసం ఏర్పాటు చేసిన సర్వీస్ రోడ్లు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. రోడ్డు అంచులు తేలిపోవడంతో వాహన దారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్న పరిస్థితి కనిపిస్తోంది.రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన సిమెంట్ బ్యారికేడ్లు కూడా సడలిపోయి, సీకులు తేలి వాహన దారులకు అడ్డంకిగా మారాయి. అటుగా వెళ్లే వాహనాలు వీటిని తప్పించుకునే క్రమంలో అదుపు కోల్పోయి తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇక అత్యంత ప్రమాదకరమైన విషయం ఏమిటంటే, సర్వీస్ రోడ్ ప్రారంభమయ్యే ప్రదేశంలోనే భారీ వాహనాలు అడ్డంగా నిల్పడంతో సర్వీస్ రోడ్ ఎక్కడ ప్రారంభమవుతుందో స్పష్టంగా కనిపించక, ద్విచక్ర వాహన దారులు అయోమయానికి గురవుతున్నారు. చివరి క్షణంలో మలుపు తిప్పే ప్రయత్నంలో ప్రమాదాలు జరిగే అవకాశం పొంచి ఉంది.ఇక సర్వీస్ రోడ్లలో ఎక్కడా విద్యుత్ దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో పూర్తిగా చీకటి కమ్మేస్తోంది. దీంతో ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారుతోంది.వర్షా కాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. సర్వీస్ రోడ్డుపై నీరు నిలిచి పోవడంతో దారి కనిపించకుండా పోయి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

### స్పీడ్‌కు బ్రేక్ ఎక్కడ?

టోల్ ప్లాజా వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించే ఎలాంటి చర్యలు లేకపోవడంతో భారీ వాహనాలు, కార్లు అతివేగంగా లోపలికి దూసుకెళ్తున్నాయి. స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో డ్రైవర్లు వేగం తగ్గించకుండా నేరుగా టోల్ గేట్ల వరకు చేరుతున్నారు.అధిక వేగంతో వచ్చే వాహనాలు టోల్ సిబ్బంది, ఇతర వాహన దారులకు ప్రాణహానికరంగా మారుతున్నాయి. రద్దీ సమయాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా మారి ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని వాహన దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.వేగ నియంత్రణకు అవసరమైన స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు లేకపోవడం స్పష్టమైన నిర్లక్ష్యంగా కనిపిస్తోంది. ఎప్పుడైనా పెద్ద ప్రమాదం జరిగే అవకాశముండగా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### ఫిర్యాదు చేసినా ఫలితం లేదు

జాతీయ రహదారిపై ఉన్న సమస్యలపై పలుమార్లు 1906 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాహనదారుడు ఇంతియాజ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఈ మార్గంలో తరచుగా ప్రయాణిస్తూ, టోల్ రుసుము చెల్లించి సమస్యలనే ఎదుర్కొంటున్నామని అసహనం వ్యక్తం చేస్తున్నారు.ప్రయాణికుల భద్రతకు సంబంధించి ఇన్ని సమస్యలు ఉన్నప్పటికీ సంబంధిత అధికారుల నుంచి స్పందన లేకపోవడం తీవ్ర నిర్లక్ష్యంగా కనిపిస్తోంది. ప్రజల ప్రాణాల పట్ల ఇంత నిర్లక్ష్యం ఎందుకు అని వాహనదారుడు ఇంతియాజ్ ప్రశ్నిస్తున్నారు.

### మిర్రర్ లేక ముప్పులో ప్రయాణం

కంకోల్–బుధేర అండర్‌బ్రిడ్జ్ వద్ద బ్లైండ్ స్పాట్ మిర్రర్ లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్వీస్ రోడ్ నుంచి వస్తున్న వాహనాలు, అండర్‌బ్రిడ్జ్ లోపల నుంచి వచ్చే వాహనాలకు కనిపించక ప్రమాదాలకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో, భారీ వాహనాల రాకపోకల సమయంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది.స్థానికులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు చర్యలు కనిపించలేదు. వెంటనే బ్లైండ్ స్పాట్ మిర్రర్ ఏర్పాటు చేయడంతో పాటు హెచ్చరిక బోర్డులు, సరైన లైటింగ్ ఏర్పాటు చేయాలని వాహన దారులు కోరుతున్నారు.ప్రాథమిక భద్రతా చర్యలు లేకపోవడం వల్ల ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తమవుతోంది.







# గుమ్మడిదల పారిశ్రామిక వాడలో మే డే వేడుకలకు సన్నాహాలు

- కార్మిక శక్తి, త్యాగాలకు జోహార్లు పలుకుతూ గళమెత్తనున్న కార్మిక లోకం

**గుమ్మడిదల, ఏప్రిల్ 30 (సిరి న్యూస్):**

ప్రపంచ కార్మికుల పండుగ అయిన మే డే (కార్మిక దినోత్సవం) వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు గుమ్మడిదల పారిశ్రామిక వాడ కార్మిక లోకం సన్నద్ధమైంది. శుక్రవారం మే 1న జరగనున్న ఈ వేడుకల సందర్భంగా కార్మిక సంఘాల నేతలు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్మికుల ఐక్యత, శ్రమ విలువను చాటి చెప్పే గీతాలు, నినాదాలతో పారిశ్రామిక ప్రాంతం మారుమోగేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. బడిలో, గుడిలో, సాగులో, భూమిలో, కొండలను పిండి చేసే కూలీ నుంచి ఇటుక బట్టీలు కార్మికులు, చిన్న పరిశ్రమలు, పెద్ద కార్ఖానాలు, నిప్పుల కొలిమిలో పనిచేసే ప్రతి కార్మికుడి కష్టాన్ని గుర్తుచేస్తూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్మికుడే సృష్టి మూలం, కార్మికుడే శివశక్తి అనే భావనను ప్రజల్లో చైతన్యం కలిగించేలా గీతాలు, నృత్యాలు, ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. కార్మికుల శ్రమే సమాజ అభివృద్ధికి పునాది అని వారి త్యాగాలకు కొలమానం లేదని నాయకులు పేర్కొన్నారు. రోజువారీ జీవన సౌందర్యానికి కార్మికులే ఆధారం అని వారి కృషి లేకుండా ఏ రంగం ముందుకు సాగదని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో కార్మికుల హక్కులు, సంక్షేమం, సమానత్వం కోసం మరింత ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.




### నాడు చికాగోలో ఎగిరిన పోరాట జెండా

ప్రపంచ కార్మిక చరిత్రలో 1886 మే 1 కి ప్రత్యేక స్థానం ఉంది. అప్పటి వరకు ప్రపంచవ్యాప్తంగా కార్మికులు రోజుకు 16 నుంచి 18 గంటలు పని చేయాల్సిన దుస్థితి నెలకొని ఉండేది. తక్కువ వేతనాలతో, కఠిన పరిస్థితుల్లో యజమాన్యాలు కార్మికులను దోపిడీ చేయడం సర్వసాధారణమైంది.ఈ అన్యాయానికి వ్యతిరేకంగా ప్రపంచ కార్మికులు పోరాట పంథాను ఎంచుకున్నారు. ముఖ్యంగా అమెరికాలోని చికాగో నగరంలో కార్మికులు భారీ స్థాయిలో సమ్మెలు చేపట్టి 8 గంటల పని, 8 గంటల విశ్రాంతి, 8 గంటల వ్యక్తిగత జీవితం అనే నినాదంతో ఉద్యమించారు. ఈ పోరాటంలో అనేక మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. వారి త్యాగాల ఫలితంగా 8 గంటల పని విధానం అమల్లోకి వచ్చింది. కార్మికుల రక్తంతో ఎగిసిన ఆ పోరాట జెండా ప్రపంచ వ్యాప్తంగా కార్మిక ఉద్యమాలకు దిక్సూచి అయింది. అప్పటి నుండి ప్రతి సంవత్సరం మే 1ను ప్రపంచ కార్మిక దినోత్సవంగా జరుపుకుంటూ కార్మికుల హక్కులు, గౌరవం కోసం నినదిస్తున్నారు. సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉండాలని, సంక్షేమం కోసం పోరాటం కొనసాగించాలని వారు పిలుపునిచ్చారు.ఈ మే డే సందర్భంగా గుమ్మడిదల పారిశ్రామిక వాడలో కార్మికులు భారీ ర్యాలీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చైతన్య గీతాలతో తమ శక్తిని చాటిచెప్పేందుకు సిద్ధమవుతున్నారు.

# హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

- 5 వేల రూపాయల జరిమానా
- సమర్థవంతమైన దర్యాప్తుతో శిక్ష ఖరారు.
- జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు.

**రామాయంపేట, (మనోహరాబాద్)ఏప్రిల్ 30(సిరి న్యూస్)**

మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2023 నవంబర్ 19న జరిగిన హత్య కేసులో నిందితుడు సూరజ్‌కు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి నీలిమ జీవిత ఖైదుతో పాటు రూ.5,000 జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. గీత ప్యానల్ ప్రొడక్ట్ కంపెనీలో పనిచేస్తున్న సూరజ్, రజిని దేవి అక్కడే నివసిస్తూ జీవనం సాగించేవారు. వీరి మధ్య కొంతకాలంగా వ్యక్తిగత విభేదాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో 2023 నవంబర్ 19న ఆవేశానికి లోనైన సూరజ్, రజిని దేవిని చీరతో గొంతు బిగించి హత్య చేసి పారిపోయాడు. ఈ ఘటనపై కంపెనీ ప్రతినిధి ఫిర్యాదు మేరకు మనోహరాబాద్ ఎస్సై కరుణాకర్ రెడ్డి కేసు నమోదు చేశారు. అప్పటి తూప్రాన్ సీఐ శ్రీధర్ సంఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, అన్ని సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేశారు. అనంతరం ప్రస్తుత దర్యాప్తు అధికారి రంగా కృష్ణ కోర్టులో సాక్ష్యాలను సమర్థవంతంగా ప్రవేశ పెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ బలమైన వాదనలు వినిపించడంతో, కోర్టు నిందితుడికి జీవిత ఖైదు విధించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కేసులో కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఎస్సై విట్టల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, సీడీఓ మహిపాల్ రెడ్డి సహకరించినట్లు ఎస్పీ తెలిపారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.



# కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు 30,000కు పెంచాలి

## పెంపును తక్షణమే అమలు చేయాలని డిమాండ్

## లోక్ జనశక్తి పార్టీ లేబర్ సెల్ అధ్యక్షుడు సురేందర్



**రామచంద్రపురం, ఏప్రిల్ 30, (సిరి న్యూస్):**

కాంట్రాక్ట్ కార్మికుల కనీస వేతనాన్ని నెలకు ₹30,000గా నిర్ణయించి వెంటనే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర లోక్ జనశక్తి పార్టీ లేబర్ సెల్ అధ్యక్షుడు సురేందర్ కోరారు.కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం బిహెచ్ఈఎల్ (BHEL) టౌన్షిప్‌లో సుమారు 50 మంది పారిశుధ్య కార్మికులు, మహిళా కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్‌తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ, దశాబ్దాలుగా వివిధ విభాగాల్లో సేవలందిస్తున్న కార్మికుల జీవన పరిస్థితులు ఇంకా మెరుగుపడలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుతం ₹10,000 నుంచి ₹15,000 వరకు మాత్రమే చెల్లించడం అన్యాయమని పేర్కొన్నారు. ప్రభుత్వాలు పేదల సంక్షేమంపై దృష్టి పెట్టామని చెబుతున్నప్పటికీ, తగిన పారితోషికం అందించడం లేదని విమర్శించారు. రోజుకు సుమారు ₹500 చొప్పున చెల్లింపులు చేయడం కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తోందని అన్నారు.కనీస వేతనాన్ని ₹30,000కు పెంచి వెంటనే అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. లోక్ జనశక్తి పార్టీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పెంటయ్య, బాలయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



**వెల్దుర్తి ఏప్రిల్ 30,( సిరి న్యూస్):**

వెల్దుర్తి మండల పరిధిలోని మెల్లూరు గ్రామంలో పిఏసిఎస్ దాన్యం కొనుగోలు కేంద్రంను గ్రామ సర్పంచ్ రంగా రెడ్డి తహసీల్దార్ శ్రీనివాస్ తో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ, రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారుల చేతుల్లో పోసి మోసపోవద్దని అన్నారు. రైతు పండించిన ప్రతి దాన్యపు గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు ధాన్యం విక్రయాలలో నాణ్యత ప్రమాణాలు పాటించి ప్రభుత్వం అందించే మద్దతు ధరను అందుకోవాలని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు కావలసిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి శ్రీనివాస్,నాయకులు, శ్రీనివాస్, నారాయణ రెడ్డి నెల్లూరు, రైతులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అభివృద్ధే లక్ష్యం

## మున్సిపాలిటీలకు ఎమ్మెల్యే జీఎంఆర్ భరోసా

## నూతన కోఆప్షన్ సభ్యులకు శుభాకాంక్షలు



**రామచంద్రపురం (పటాన్చెరు), ఏప్రిల్ 30, (సిరి న్యూస్):**

పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని మున్సిపాలిటీల అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.గురువారం ఇంద్రేశం, జిన్నారం మున్సిపాలిటీలలో నూతన కోఆప్షన్ సభ్యుల ఎంపిక అనంతరం, వారు మున్సిపల్ పాలకవర్గ సభ్యులతో కలిసి ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా తమకు అందించిన సహకారానికి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు విశ్వాసంతో బిఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇచ్చారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేయాలని అన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధికి తన సహకారం కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇంద్రేశం మున్సిపల్ చైర్మన్ ప్రమీల, జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, వైస్ చైర్మన్లు హరీష్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, సీనియర్ నాయకులు అంతి రెడ్డి, రామచంద్ర రెడ్డి, వెంకటేష్ గౌడ్, కౌన్సిలర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# నూతన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునికి అభినందనల వెల్లువ

## ఘనంగా సన్మానించిన మాజీ ఎంపీపీ



**కొండాపూర్, ఏప్రిల్ 30(సిరి న్యూస్):**

నూతనంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునికి అభినందనలు వెల్లువేత్తాయి. గురువారం మునిదేవునిపల్లిలో మాజీ ఎంపీపీ యాదయ్య, గ్రామస్తులు కొండాపూర్ నూతన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీకి నిరంతరం గ్రామంలో మండలంలో చేసిన సేవలకు గుర్తింపుగా మండల పార్టీ అధ్యక్షుడి నియామకం హర్షించదగ్గ విషయ మన్నారు. మునుముందు మరిన్ని బాధ్యతలు చేపట్టి జిల్లా రాష్ట్ర స్థాయిలో ప్రజల మానాలు పొంది ప్రజా ప్రతినిధిగా ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రజల సమస్యలపై కమిషనర్ దృష్టి

## తెల్లాపూర్ లో సమావేశం

## సిఎంసి కమిషనర్ శ్రీజనకు కాలనీ వాసుల వినతులు

## నీరు, రహదారులు, పన్నులపై ప్రధాన డిమాండ్లు



**రామచంద్రపురం, ఏప్రిల్ 30, (సిరి న్యూస్):**

తెల్లాపూర్‌లో నిర్వహించిన సమావేశంలో పిఏసిఎస్ చైర్మన్ మల్లెపల్లి బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో కాలనీ వాసులు సిఎంసి కమిషనర్ శ్రీజనను కలిసి తమ సమస్యలను వివరించారు. గ్రేటర్‌లో విలీనం అయినప్పటికీ తగిన మౌలిక సదుపాయాలు అందడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.గ్రేటర్ పరిధిలో అమలవుతున్న విధంగా ప్రతి ఇంటికి నెలకు 20,000 లీటర్ల ఉచిత తాగునీరు అందించాలని కోరారు. మురుగునీటి సమస్య పరిష్కారం కోసం ఎస్టీపీల (STPs) ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ఆర్ఆర్–7, ఆర్ఆర్–30 రహదారులను అభివృద్ధి చేసి రవాణాకు అనుకూలంగా మార్చాలని విజ్ఞప్తి చేశారు.అనుమతి లేకుండా నడుస్తున్న ఆర్ఓ ప్లాంట్లను తొలగించాలని, కాలనీల్లో వీధి లైట్లు ఏర్పాటు చేయాలని, ఇంటి పన్నులను తగ్గించాలని కాలనీ వాసులు కమిషనర్ దృష్టికి తీసుకు వచ్చారు.ఈ సమావేశంలో శేర్లింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ, పటాన్‌చెరు డీసీ జ్యోతి రెడ్డి, సి.పి. రెడ్డి, శ్రీశైలం, బాబుగౌడ్ తదితరులు పాల్గొన్నారు. తెల్లాపూర్ గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను వెల్లడించారు.

# ప్రతి పౌరుడు హక్కుల తో పాటు విధులను ఆచరించాలి



**వెల్దుర్తి .ఏప్రిల్ 30. (సిరి న్యూస్)**

వెల్దుర్తి మండలం లోని రామాయపల్లి గ్రామపంచాయతీలో గురువారం రెవిన్యూ అలాగే పోలీస్ వారు పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌర హక్కుల గురించి పోలీస్ సిబ్బంది వివరించారు. పౌరునికి ఉన్న హక్కుల తో పాటు విదులను కూడా గుర్తించి వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వం దృష్టిలో అంతా సమనమేనని అసమానతలు పాటించవద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్, వార్డు సభ్యులు, గ్రామస్తులు, ఉన్నారు

# అంగన్వాడీ కేంద్రాల డిజిటలైజేషన్ కు అడుగులు

## ఉపాధ్యాయులకు మొబైల్ ఫోన్లు

## ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ



**రామచంద్రపురం (పటాన్చెరు), ఏప్రిల్ 30, (సిరి న్యూస్):**

అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధి, డిజిటలైజేషన్ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో గురువారం పటాన్చెరులోని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న 153 మంది ఉపాధ్యాయులకు మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు ఈ మొబైల్ ఫోన్లు ఉపయోగపడతాయని అన్నారు. ఉపాధ్యాయులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని పిల్లలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సిడిపిఓ జయరాం నాయక్, తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, అంగన్వాడీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# రామాయంపేట మున్సిపల్ కో-ఆప్షన్ ఎన్నికల్లో కాంగ్రెస్ 'క్లీన్ స్వీప్'

- నలుగురు సభ్యుల ఎన్నిక లాంచనమే..
- నేడు ఉదయం 11:30కు సమావేశం
- పోటీ నుంచి తప్పకున్న అనిల్ కుమార్
- డియాకు అనుమతి లేదు
- మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి.

**రామాయంపేట, ఏప్రిల్ 30(సిరి న్యూస్)**




రామాయంపేట మున్సిపాలిటీలో కో–ఆప్షన్ సభ్యుల ఎన్నికల సందడి నెలకొంది. నేడు (శుక్రవారం) జరగనున్న ఈ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ నాలుగు స్థానాలను కైవసం చేసుకోనుంది. మున్సిపాలిటీలోని మొత్తం 12 వార్డులకు గాను, నలుగురు కో–ఆప్షన్ సభ్యుల ఎన్నిక కోసం రంగం సిద్ధమైంది. ఇందులో రెండు స్థానాలను మైనార్టీలకు, మరో రెండు స్థానాలను ఇతరులకు కేటాయించారు.

**తీవ్ర ఉత్కంఠ.. చివరికి ఏకగ్రీవం..**

నలుగురు సభ్యుల కోటా కోసం మొత్తం 6 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పటికే మూడు స్థానాలు ఏకగ్రీవం కాగా, మిగిలిన ఒక్క స్థానం కోసం దేమే యాదగిరి, బోర్ర అనిల్ కుమార్, విపీ చంద్ర ప్రతాప్.. ముగ్గురు అభ్యర్థులు పోటీ పడ్డారు. అయితే, కాంగ్రెస్ పార్టీకి చెందిన అనిల్ కుమార్, దేమే యాదగిరి మధ్య పోటీ నెలకొనడంతో పార్టీ అధిష్టానం రంగంలోకి దిగింది. మెజార్టీ కౌన్సిలర్లు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సూచించిన అభ్యర్థి వైపే మొగ్గు చూపడంతో, పార్టీ ఆదేశాల మేరకు అనిల్ కుమార్ తన నామినేషన్ ఉపసంహరించుకున్నారు. మరో అభ్యర్థి చంద్ర ప్రతాప్‌కు తగిన బలం లేకపోవడంతో, దేమే యాదగిరి ఎన్నిక ఏకగ్రీవం కావడం లాంచనమైంది. దీంతో చింతల రాధా భవాని, దేమే యాదగిరి, మహమ్మద్ గౌస్ పాషా,ఆసియా సుల్తానా లు ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు.

**మీడియాకు అనుమతి లేదు: మున్సిపల్ కమిషనర్**

రేపు ఉదయం 11:30 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో కో–ఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఆ వెంటనే కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి తెలిపారు. అయితే, ఈ ఎన్నికల ప్రక్రియకు మీడియా ప్రతినిధులకు అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు. సమావేశం ముగిసిన అనంతరం వివరాలతో కూడిన ప్రెస్ నోట్ విడుదల చేస్తామని ఆయన వెల్లడించారు.

# జిల్లాలో నెల రోజుల పాటు పోలీసు యాక్ట్

- ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు నిర్వహించరాదు
- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

**సంగారెడ్డి, ఏప్రిల్ 30 (సిరి న్యూస్):**



జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని మే నెల అంతటా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ తెలిపారు. మే 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలు చేస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ నిబంధనల ప్రకారం జిల్లాలో ఎలాంటి బహిరంగ సభలు, సమావేశాలు, ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు మరియు ర్యాలీలు నిర్వహించాలన్నా పోలీసుల ముందస్తు అనుమతి తప్పనిసరి అని ఎస్పీ స్పష్టం చేశారు. అనుమతి లేకుండా సమూహాలుగా ఏర్పడి నిరసనలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజాధనానికి నష్టం కలిగించేలా లేదా ప్రజల ప్రశాంతతకు భంగం కలిగించేలా ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడ వద్దని ఎస్పీ సూచించారు. జిల్లాలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పోలీసులకు సహకరించి జిల్లాలో శాంతియుత వాతావరణం ఉండేలా చూడాలని ఆయన కోరారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు

- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ
- డాకూర్ గ్రామంలో హెల్త్ క్యాంప్ ను ప్రారంభించిన మంత్రి

**జోగిపేట, ఏప్రిల్ 30, (సిరి న్యూస్):**



ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నట్లు రాష్టఆ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర్ రాజనరసింహ అన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ప్రజారోగ్యాన్ని బలోపేతం చేస్తున్నట్లు ఆయన అన్నారు. గురువారం ఆందోల్ మండలం డాకూర్ గ్రామంలో ధర్మశాస్త్ర ఫౌండేషన్, సహార ఆసుపత్రి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా హెల్త్ క్యాంప్ ను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించడానికి వైద్య, ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేస్తున్నామన్నారు. క్యాన్సర్, డయాలసిస్, గుండె సంబంధ చికిత్స లను ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా అందిస్తున్నామన్నారు. డాకూర్ గ్రామానికి చెందిన ప్రజల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకోవడానికి గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలు వెన్ను, కీళ్ల నొప్పుల కోసం డాక్టరు సూచనలు లేకుండా విరివిగా పెయిన్ కిల్లర్ మందు గోళీలు వాడటం వల్ల మూత్రపిండాల లో సమస్యలు వస్తాయని మంత్రి వెల్లడించారు. డాక్టర్ సూచనలు మందు గోలిలు వాడొద్దని సూచించారు. గ్రామ ప్రజలు వైద్య చికిత్సల కోసం దగ్గర్లో ఉన్న జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రి, సంగారెడ్డి లోని జిల్లా ఆసుపత్రిలో మెరుగైన వైద్య చికిత్సలు ఉచితంగా అందిస్తున్నామన్నారు ప్రజలు వాటిని వినియోగించుకోవాలని సూచించారు. సామాజిక కార్యకర్త ముప్పారం ప్రకాశం క్యాన్సర్ చికిత్సకు సహారా ఆసుపత్రిలోని వైద్యులు సరైన చికిత్సను అందించడంతో ప్రకాశం త్వరగా కోలుకున్నారన్నారు. క్యాన్సర్ అని తెలిసిన వెంటనే ప్రకాశానికి విలువైన క్యాన్సర్ నివారణకు అవసరమైన మందులను ఉచితంగా అందించి అండగా నిలిచారని వెల్లడించారు. ఈ సందర్భంగా మెడికల్ క్యాంపు లో పాల్గొన్న సహారా హాస్పిటల్ డాక్టర్లు, సిబ్బంది కి ప్రశంస పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి డిఎంహెచ్ఓ వసంత్ కుమార్, డాకూరు గ్రామ సర్పంచ్ వసంత్‌రెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, నాయకులు జీ ఆర్ మదు సూధన్ రెడ్డి , ప్రజా ప్రతినిధులు, పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు హెల్త్ క్యాంపులో పాల్గొన్నారు.

# ఆస్తి పన్నుపై ఎర్లీ బర్డ్ సందడి

- ముందస్తు చెల్లింపుతో భారీగా ఆదా!
- ఆస్తి పన్ను వసూళ్లలో దూకుడు
- ఎర్లీ బర్డు ద్వారా రూ.27.18 కోట్లు జమ!

**అమీన్ పూర్ ఏప్రిల్ 30 సిరి న్యూస్**





సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, శేర్లింగంపల్లి జోన్ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు అమీన్పూర్ సర్కిల్లో ఆస్తిపన్ను వసూలు ముమ్మరంగా సాగాయి. రూ.27.18 కోట్ల రూపాయల ఆస్తిపన్ను వసూలు చేసామని తెలిపారు. ఎర్లీ బర్డు స్కీం మరియు ప్రత్యేక డ్రైవ్ ద్వారా అమీన్పూర్ సర్కిల్లో ఏకంగా రూ.27.18 కోట్ల ఆస్తిపన్ను వసూలు చేసి అధికారులు రికార్డు సృష్టించారు. 5 శాతం రాయితీపై విస్తృత ప్రచారం ఎర్లీ బర్డు పథకం కింద ఏప్రిల్ 30 లోపు పన్ను చెల్లించే వారికి లభించే ఐదు శాతం రిబేట్ గురించి ప్రజలకు మరియు వ్యాపారస్తులకు అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో ఐదుగురు ఏఎంసీలతో కూడిన ఐదు వేరు వేరు బృందాలుగా ఏర్పడి రెవెన్యూ సిబ్బంది భాగస్వామ్యంతో వివిధ వ్యాపారులకు అవగాహన కల్పించి ఆస్తి పన్ను వసూలు చేయడం జరిగిందని అన్నారు. గురువారం హిందుస్థాన్ కోకా కోలా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ స్పందించి రూ.85,77,866 లు రానే మద్రాస్ కంపెనీ లిమిటెడ్ సంస్థ స్పందించి రూ.9,78,302 లు మరియు టియానిష్ లాభరోటరిస్ రవి లిమిటెడ్ సంస్థ రూ.3,30,137 లు , రహి ట్రాక్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ 3,19,494 లు మరియు వివిధ టాక్స్ పేర్ల నుండి మొత్తం రూపాయలు 2,28,10,302 ఆస్తి పన్ను వసూలు చేయడం జరిగిందని తెలిపారు. గత సంవత్సరం 24.71 కోట్లు వసూలు కాగా ఈ ఆర్థిక సంవత్సరానికి 10 శాతం అదనపు టార్గెట్ కలిపి మొత్తం 27.18 కోట్లు ఆస్తిపన్ను ఎర్లీ బర్డ్ స్కీం కింద వసూలు చేయుటకు కమిషనర్ టార్గెట్ నిర్వహించడం జరిగింది.కమిషనర్ శేర్లింగంపల్లి వారి ఆదేశములకు అనుగుణంగా విధించిన టార్గెట్ ను అధిగమిస్తూ రూ.27.84 కోట్లు ఆస్తిపం వసూలు చేయడం జరిగిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరియు కమిషనర్ జిహెచ్ఎంసి సిఎంసి వారు కల్పించిన ఎర్లీ బర్డ్ స్కీమ్ కింద ఐదు శాతం రాయితీని సద్వినియోగం చేసుకుంటూ పెద్ద మొత్తంలో ఆస్తి పన్నులు చెల్లించి సిఎంసి అభివృద్ధికి తోడ్పడుతున్న ఆస్తి పన్ను చెల్లింపు దారులు అందరికీ, డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.ఆస్తి పన్ను వసూళ్లలో బాధ్యతయుతంగా పనిచేసిన ఏఎంసీలను మరియు రెవెన్యూ సిబ్బందిని డిసి అభినందించారు. ఆస్తి పన్ను వసూలు కార్యక్రమంలో ఏఎంసీలు జి మనోహర్, టీ నర్సింలు, జి మల్లికార్జున స్వామి, సాయిలు, శ్రీధర్, బిల్ కలెక్టర్లు, మరియు రెవెన్యూ సిబ్బంది తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు కార్డన్ సెర్చ్



**తాండూర్(సిరి న్యూస్ ):** నేరాల నియంత్రణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు తాండూర్ సీఐ దేవయ్య అన్నారు. గురువారం తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అచలాపూర్ గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల నివారణలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయని, ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని అన్నారు. ప్రతి ఇంటి పరిసర ప్రాంతాల్లో, ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దొంగతనాలు జరిగినప్పుడు నిందితులను గుర్తించడంలో ఇవి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు నకిలీ విత్తనాలను కొనుగోలు చేయవద్దని పేర్కొన్నారు. గ్రామంలో ఎవరైనా నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. అదేవిధంగా మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని, ద్విచక్ర వాహనాలపై ముగ్గురు ప్రయాణించరాదని, ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, పోలీసులు ప్రతిరోజూ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు అన్నారు. వేసవి కాలంలో విహార యాత్రలకు వెళ్లే వారు ఇంట్లో నగదు, నగలు ఉంచకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని పేర్కొన్నారు. యువత ఆన్లైన్ గేమ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టాలని, ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. అనంతరం తనిఖీల్లో పట్టుబడిన వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎస్సై ప్రసాద్రావు, కన్నెపల్లి ఎస్సై భాస్కరరావు, మాదారం ఎస్సై సౌజన్య, భీమిని ఎస్సై కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గ్రామానికి సమాన ప్రాధాన్యం ఇస్తాం

- **ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్**



**సత్తుపల్లి(సిరి న్యూస్ ):** నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి సమాన ప్రాధాన్యం ఇస్తామని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. గురువారం సత్తుపల్లి నియోజకవర్గంలోని పెనుబల్లి, గంగదేవిపాడు, తుమ్మలపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పలు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు. గంగదేవిపాడు గ్రామంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కాకా రామారావు కుమారుడు సాజిత్–సాయి శ్రావణి వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే బన్నే వెంకటేశ్వరరావు కుమారుడు రమేష్–మౌనిక, బానోత్ కృష్ణ కుమారుడు వేణుగోపాల్–లక్ష్మీ మమత, కొర్ర శ్రీను–దేవి కుమారుడు నవీన్–పావని వివాహ వేడుకల్లో పాల్గొని ఆశీస్సులు అందించారు. గంగదేవిపాడు గ్రామానికి చెందిన మాలోత్ కృష్ణ దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం తుమ్మలపల్లి గ్రామంలో ఆంబోజి గోపి కుమార్తెలు శరణి, సలోని ఓనిల అలంకరణ కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాల్లో పెనుబల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పంది వెంకటేశ్వరరావు, ఏఎంఎంసీ వైస్ చైర్మన్ కోటేశ్వరరావు, గంగదేవిపాడు గ్రామ సర్పంచ్ రాధాకృష్ణ, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పోట్లపల్లి వెంకటేశ్వరరావు, తుమ్మలపల్లి గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం

**ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**



**వరంగల్(సిరి న్యూస్ ):** ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నిరుపేదలకు వరం లాంటిదని, వైద్య సహాయం అందించడం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పాలనకు నిదర్శనమని వర్ధన్నపేట ఎమ్మెల్యే, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. గురువారం హనుమకొండ సుబేదారి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 3వ డివిజన్కు చెందిన నమాసాని నాగరాజు అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందగా, ఆయన చేసిన దరఖాస్తు మేరకు సీఎం సహాయనిధి నుంచి రూ.1లక్ష 73వేల 950 మంజూరు కాగా, ఆ చెక్కును లబ్ధిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా చేసుకుని పనిచేస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వ్యాధులు, ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదల వైద్య ఖర్చులకు సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది పేదల ప్రాణాలు సీఎం సహాయనిధి ద్వారా నిలబడుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ జన్ను శీభారాణి–అనిల్ కుమార్, కాంగ్రెస్ నాయకులు బుద్దె పెద్దన్న, బిజిలి సంపత్ తదితరులు పాల్గొన్నారు.


# సొంతింట కల నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం





**ములుగు(సిరి న్యూస్ ):** ప్రజా ప్రభుత్వం పేదలకు సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా పనిచేస్తోందని ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్ అన్నారు. రాష్ట్ర మంత్రి సీతక్క ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనలతో గురువారం ములుగు మండలం పత్తిపల్లి గ్రామానికి చెందిన ఇస్లావత్ రాజన్న నూతన ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద ప్రజలకు సొంత ఇంటి కల నెరవేర్చడం ప్రజా ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. మంత్రి సీతక్క కృషితో తమ సొంత ఇంటి కల నెరవేరిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ధరావత్ సరిత సారయ్య, మండల పార్టీ ఉపాధ్యక్షులు అర్షం రఘు, కార్యదర్శి విద్యాధర్ రెడ్డి, ములుగు పట్టణ యూత్ అధ్యక్షుడు అభినయ్ చారి, పోరిక రాజుకుమార్, యూత్ నాయకులు బండి రమేష్, ప్రభు, గూడెపు రాకేష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలి





**గంభీరావుపేట(సిరి న్యూస్ ):** ప్రజలకు మేలు చేసే సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు సాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు అన్నారు. గంభీరావుపేట మండలం శ్రీగాధ గ్రామంలో గురువారం ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లబ్ధిదారులకు సారెచీరెలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు నచ్చే విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్లను పూర్తిగా పారదర్శకంగా మంజూరు చేస్తున్నామని, అర్హులకే పథకాలు అందుతున్నాయని, పైరవీలకు అవకాశం లేదని తెలిపారు. సొంతింటి కలను నిజం చేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ అని, రాష్ట్ర వ్యాప్తంగా తొలి విడతలో నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, రెండో విడతలో మరో నాలుగు లక్షల ఇళ్లు మంజూరు కానున్నాయని చెప్పారు. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, తెల్ల రేషన్ కార్డులు, రైతు రుణమాఫీ, రైతు భరోసా వంటి ఎన్నికల హామీలను ఇప్పటికే అమలు చేసినట్లు తెలిపారు. త్వరలో కొత్త పెన్షన్లు కూడా లక్ష మందికి మంజూరు కానున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు సుద్దాల అనిత–గణేష్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు బందెల రాజు, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు వేముల శ్రీనివాస్ గౌడ్, నాయకులు పర్శ శ్రీనివాస్, గౌరినేని శ్రావణ్ రావు, వేముల యాదగౌడ్, కత్తుల బాబు, పర్శ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కోమటిరెడ్డి

# రాజగోపాల్ రెడ్డి దాతృత్వం

మొదటిపేజీ తరువాయి

నిలుస్తూ ఉంటారు. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు భారీగా ఆర్థిక సాయం చేశారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారికి తక్షణమే రూ.1 లక్ష.. అవయవాలు చెడిపోయి బాధపడుతున్న మరో చిన్నారికి రూ.2.5 లక్షల ఆర్థిక సాయం అందించారు. వీటితోపాటు.. ఇంటర్‌లో మెరిసిన 151 మంది విద్యార్థులకు రూ.24.5 లక్షల బహుమతులు అందించారు. ఈ ఘటనతో కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలబడే నాయకుడు అని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నిరూపించారు. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించేందుకు నల్గొండ జిల్లాలో ఏర్పాటు చేసిన ఒక సమావేశంలో పాల్గొన్న మునుగోడు ఎమ్మెల్యే తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సమావేశంలో నిరుపేద కుటుంబాలకు చెందిన 151 మంది విద్యార్థులకు.. దాదాపు రూ.24.5 లక్షల ప్రోత్సాహక బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థుల ఉన్నత చదువులకు భరోసానిచ్చారు.

అయితే ఈ సమావేశంలో ఒక ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. తన తమ్ముడికి క్యాన్సర్ సోకిందని.. అతడు గత కొన్ని రోజులుగా ఆ వ్యాధితో పోరాడుతున్నాడని శివాని అనే విద్యార్థిని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముందు తన గోడును వెళ్లబోసుకున్నాడు. తమ కుటుంబ పరిస్థితి బాగోలేదని ఆమె కన్నీరు పెట్టుకుంది. ఆ చిన్నారి బాధను చూసి తీవ్రంగా చలించిపోయిన రాజగోపాల్ రెడ్డి.. వెంటనే రూ.లక్ష సాయం ప్రకటించారు. అంతేకాకుండా మరో రూ.2.5 లక్షల ఎల్ఓసీ మంజూరు చేసి.. వారి కుటుంబంలో ధైర్యాన్ని నింపారు. అయితే ఈ సమావేశంలో ఒక్క శివాని కుటుంబానికి మాత్రమే కాకుండా.. మునుగోడుకు చెందిన చిన్నారి మోక్షిత్‌కు కూడా ఎమ్మెల్యే కోమటిరెడ్డి అండగా నిలిచారు. మల్టీ ఆర్గాన్ వ్యాధితో బాధపడుతున్న ఓ బాలుడి చికిత్స కోసం రూ.2.5 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. ఆ బాలుడికి మెరుగైన వైద్యం అందించేందుకు రెయిన్‌బో ఆస్పత్రిలో చికిత్స చేయిస్తామని భరోసా ఇచ్చారు.





# క్రమశిక్షణకు మారుపేరు కాంగ్రెస్ సేవాదళ్

- **గాంధీ ఆలోచనలతో అవతరించింది**
- **స్వాతంత్ర్యం సాధనలో కాంగ్రెస్ పాత్ర అమోఘం : మంత్రి సీతక్క**

**హైదరాబాద్, ఏప్రిల్ 30 (సిరి న్యూస్) :**

దేశ స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్ సేవాదళ్ పాత్ర మరువలేనిదని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. కాంగ్రెస్‌ది గాంధీ అహింసా సిద్ధాంతం.. అదే సిద్ధాంతాన్ని కాంగ్రెస్ సేవాదళ్ కూడా అనుసరిస్తున్నదంటూ ఎప్పటికప్పుడు కాంగ్రెస్ సేవాదళ్ పార్టీ సిద్ధాంతాల మీద శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కాంగ్రెస్ సేవాదళ్ అంటే దేశభక్తుల సంఘం అని, జిల్లాల్లో కూడా శిక్షణ కార్యక్రమాలు సేవాదళ్ నిర్వహించాలని సూచించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరుగుతున్న కాంగ్రెస్ సేవాదళ్ కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొని సేవాదళ్ కార్యకర్తల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా చరకా పట్టి నూలు వడికారు. సేవాదళ్ కాంగ్రెస్ సిద్ధాంతాలకు శ్రీరామరక్ష అంటూ సిద్ధాంత బలం ఉంటే ఎన్ని కష్టాలు అయినా ఎదుర్కోవచ్చు అని చెప్పారు. పార్టీ త్యాగాలను, త్యాగాల చరిత్రను, పార్టీ గొప్పతనాన్ని ఘనతను గ్రామస్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. మీ శిక్షణ కార్యక్రమాలను జిల్లాలకు విస్తరిస్తే మన సైన్యం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. గాంధీ జ్ఞానం నెహ్రూగా నిర్మించిన భారత దేశ విధివిధానాలు, అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం ఈ దేశానికి వెన్నెముక అని తెలిపారు. కానీ రాజ్యాంగ వ్యవస్థలను బీజేపీ¾ భ్రస□Tటు పట్టిస్తోందని, ప్రజల ఐక్యతను దెబ్బతీసి విద్వేష రాజకీయాలను చేస్తున్నదని విమర్శించారు. గాంధీ చూపిన శాంతి బాటలో మనం విద్వేష రాజకీయాలను గెలవాలని పిలుపునిచ్చారు. ఈ దేశంలో గాడ్సే సిద్ధాంతాన్ని ఓడించింది కాంగ్రెస్ పార్టీ అని, దేశ ఆత్మను కాంగ్రెస్ పార్టీ కాపాడుతుందని, ఆ దిశలో రక్షణ దళాలుగా సేవాదళ్ కార్యకర్తలు పని చేయాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గురు తేజ్ బహదూర్

# త్యాగం నిరుపమానం

- **పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి**

**నందిగామ(రంగారెడ్డి జిల్లా), ఏప్రిల్ 30 :**

చరిత్ర, ఆధ్యాత్మికత, జాతీయ వారసత్వాల అరుదైన కలయికకు కన్హా శాంతి వనం వేదికైంది. గురు తేజ్ బహదూర్ 350వ అమరవీరుల సంవత్సరం, బాబూజీ మహారాజ్ 127వ జయంతి, రాష్ట్ర సంత్ తుక్డోజీ మహారాజ్ 117వ జయంతిని పురస్కరించుకుని గురువారం ఇక్కడ భారీ ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలో భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, హార్ట్‌ఫుల్‌నెస్ గైడ్ 'దాజీ' పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి 160 దేశాల నుండి వచ్చిన వేలాదిమంది ఆధ్యాత్మిక సాధకులు హాజరయ్యారు. తొమ్మిదవ సిక్కు గురువు 'హింద్‌దీచాదర్' (భారత రక్షణ కవచం)గా ప్రసిద్ధి చెందిన ఆయన మత స్వేచ్ఛ, మానవ హక్కుల కోసం తన ప్రాణాలను అర్పించిన అత్యున్నత త్యాగాన్ని ఈ సందర్భంగా మంత్రి జూపల్లి స్మరించుకుని ఘన నివాళులర్పించారు. ప్రపంచ చరిత్రలో గురు తేజ్ బహదూర్ జీ అద్వితీయులని, ఇతరుల మత స్వేచ్ఛను కాపాడేందుకు ప్రాణత్యాగం చేసిన గొప్ప వీరుడని కొనియాడారు. హార్ట్‌ఫుల్‌నెస్ వ్యవస్థాపకులు బాబూజీ మహారాజ్ సేవలను గుర్తుచేసుకుంటూ క్లిష్టమైన యోగా మార్గాన్ని సామాన్యులకు సైతం అందుబాటులోకి తెచ్చారని మంత్రి ప్రశంసించారు. దేవుడు ఎక్కడో దూరంగా ఉండే వ్యక్తి కాదు.. గుండె లోతుల్లో ఉండే ప్రశాంతత అని ఆయన నిరూపించారని, ఆయన చూపిన మార్గం నేడు తెలంగాణను అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రంగా మార్చింది అని పేర్కొన్నారు. కన్హా శాంతి వనం కేవలం ఒక ఆధ్యాత్మిక కేంద్రమే కాక పర్యావరణ పరిరక్షణలో ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందని మంత్రి అన్నారు. విదేశీ ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ రామప్ప దేవాలయం, గోల్కొండ కోట, బుద్ధవనం వంటి చారిత్రక కట్టడాలను సందర్శించాలని కోరారు. ఇవి మన పూర్వీకుల సృజనాత్మకత, జ్ఞానానికి చిహ్నాలని వివరించారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ ఆధ్యాత్మిక గ్రంథాలను అతిథులు ఆవిష్కరించారు. ఒకే మానవత్వం – ఒకే హృదయం అనే సందేశం ప్రపంచ శాంతికి వారధిగా నిలవాలని మంత్రి ఆకాంక్షించారు.



## బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగ

**రూ. 10 లక్షల చెక్కులను అందజేసిన నిర్మలా జగ్గారెడ్డి**



**కొండాపూర్,ఏప్రిల్ 30( సిరి న్యూస్)**

మండల పరిధి గొల్లపల్లిలో విద్యుత్ షాక్ తో మృతి చెందిన తండ్రి కొడుకు చాకలి మనయ్య, వెంకటేష్ ప్రమాదవశాత్తు గత యేడాది మృతి చెందారు.గురువారం రూ.10 లక్షల చెక్కులను బాధితురాలు మంజులకు టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రమాద వశాత్తు కుటుంబ దిక్కును కోల్పోయిన బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు ప్రత్యేక నిధులను మంజూరు చేసినట్లు వెల్లడించారు.ఈ చెక్కుల పంపిణీలో ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, ఏడీ వీరారెడ్డి, ఏఈ సిద్ది రాజ్,గొల్లపల్లి మాజీ పిఏసియస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, బాలరాజ్ గౌడ్, నాగిరెడ్డి ఆంజనేయులు,చంద్రయ్య, తదితరులు తదితరులు పాల్గొన్నారు.

## నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం



**తూప్రాన్ ఏప్రిల్ 30 సిరి న్యూస్**

తూప్రాన్ పట్టణాన శివారులోని రామాలయం సమీపంలోని అతి పురాతనమైన శ్రీ కూర్మనారసింహస్వామి జయంతి కళ్యాణ మహోత్సవం గురువారం రోజు కన్నుల పండుగ నిర్వహించారు రెండు రోజులపాటు స్వామివారికి ప్రత్యేక పూజలు ఆంజనేయ స్వామి వారికి చందనం ఆకు పూజ ధ్వజారోహణం సుదర్శన హోమం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం ఓడి బియ్యం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలను దేవాలయ నిర్వాహకులు కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు.అన్నప్రసాద కార్యక్రమాన్ని దాత బజారు రూపేష్ అందించారు నిర్వాహకులు కంటాయపాలెం వేణుగోపాల్ ఆలయ పురోహితులు అహోబిలం ప్రవీణ్ తూప్రాన్ మున్సిపల్ వైస్ చైర్మన్ కొక్కొండ సమతా కాశిరెడ్డి కౌన్సిలర్లు సబిత నాగేష్బొడ్డు జోత్స్న వేణు పాల్గొంటున్నారు

## మెదక్ డీఈఓగా ఎస్. రాజు

**అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు**

**మెదక్ ప్రతినిధి,ఏప్రిల్30(సిరి న్యూస్)**



తెలంగాణ పాఠశాల విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. మెదక్ జిల్లా విద్యాధికారి (డిఈఓ ) పదవికి పూర్తి అదనపు బాధ్యతలను అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్. రాజుకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డా. ఈ. నవీన్ నికోలాస్ గురువారం ఆదేశాలు జారీ చేశారు.ప్రస్తుతం కామారెడ్డి జిల్లా విద్యాధికారి (ఎఫ్ఏసి )గా కొనసాగుతున్న ఎస్. రాజు, ఇకపై మెదక్ డీఈఓ బాధ్యతలను కూడా అదనంగా నిర్వహించనున్నారు. ఈ నియామకం తక్షణ ప్రభావంతో అమల్లోకి వచ్చి, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు కొనసాగుతుంది. ఎస్. రాజు వెంటనే మెదక్ జిల్లా విద్యాధికారి పదవికి సంబంధించిన పూర్తి బాధ్యతలను స్వీకరించి, అమలు నివేదికను సమర్పించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ నిర్ణయానికి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆమోదం తెలిపినట్లు అధికారిక ప్రకటనలో వెల్లడించారు.

## పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని రేవతికి సన్మానం



**హన్మకొండ(సిరి న్యూస్ ):** హన్మకొండ మనదర్గా ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని బందెల రేవతి పదో తరగతి పరీక్షల్లో 528 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థి సింగారపు రవి ప్రసాద్ గురువారం ఆమెను ఘనంగా సన్మానించారు. విద్యార్థిని సాధించిన విజయాన్ని కొనియాడుతూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. కష్టపడి చదివితే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా ఉత్తమ ఫలితాలు సాధించగలరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, క్లాస్ టీచర్, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థి సిరిమల రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# భూసేకరణతో ప్రమాదంలో గ్రామాల భవిష్యత్తు

- **టీజీ ఐఐసీ, హెచ్ఎండీఏ భూసేకరణతో ఇబ్బందులు**
- **ఇందిరమ్మ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుల్లోనూ లోపాలు**
- **మంత్రి సమక్షంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆందోళన**



**సంగారెడ్డి, (సిరి న్యూస్):**

గ్రామాల్లో కనీస సౌకర్యాలు, అవసరాల కోసం కూడా స్థలం లేకుండా మొత్తం భూములను స్వాధీనం చేసుకుంటే భవిష్యత్తులో తీవ్ర సమస్యలు తలెత్తుతాయని అని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజాప్రతినిధుల సమీక్ష సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో ఆయన ఈ విషయాలను ప్రస్తావించారు. నియోజకవర్గంలోని పలు మండలాలు, గ్రామాల్లో టీజీ ఐఐసీ భూసేకరణపై రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామాల అభివృద్ధి, శ్మశాన వాటికలు వంటి అవసరాలకు తగిన స్థలం కేటాయించకుండా భూములను తీసుకోవడం సరైంది కాదని పేర్కొన్నారు. ల్యాండ్ పూలింగ్ కింద హెచ్ఎండీఏ స్వాధీనం చేసుకున్న భూముల విషయంలో కూడా హామీలు అమలు కాలేదని విమర్శించారు. రైతులకు ఎకరానికి 600 గజాలు అభివృద్ధి చేసి ఇస్తామని చెప్పినా ఇప్పటివరకు అమలు కాలేదని, రైతుబంధు, రైతు బీమా వంటి లబ్ధులు కూడా అందడం లేదని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో జాప్యం జరుగుతోందని, ఎమ్మెల్యే కోటా ప్రకారం ఇళ్ల మంజూరులో పారదర్శకత లోపిస్తోందని పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులకు న్యాయంగా ఇళ్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా గతంలో మంజూరైన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో అనేక ఇళ్లు ఇంకా అసంపూర్తిగా ఉన్నాయని తెలిపారు. వాటి నిర్మాణానికి నిధులు విడుదల చేసి త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని విజ్ఞప్తి చేశారు. అక్రమంగా ఆక్రమించి నివసిస్తున్న వారిని తొలగించి నిజమైన అర్హులకు ఇళ్లు కేటాయించాలని కోరారు. సదాశివపేట మండలం పెద్దాపూర్ గ్రామంలో భూస్వాధీనం సమస్యను ప్రస్తావిస్తూ, రైతులు జీవనాధారం కోల్పోతున్నారని చెప్పారు. గతంలో జరిగిన ఘటనలను గుర్తుచేస్తూ రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇక సంగారెడ్డి నియోజకవర్గం అలియాబాద్ గ్రామంలో భూములు వక్ఫ్ బోర్డు రికార్డుల్లో నమోదు కావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతుల వద్ద చట్టబద్ధ పత్రాలు ఉన్నప్పటికీ సమస్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ భూములను వక్ఫ్ రికార్డుల నుంచి తొలగించి సమస్యను త్వరగా పరిష్కరించాలని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

# బొంతపల్లి పారిశ్రామిక ప్రాంతంలో మే డే వేడుకలు





**గుమ్మడిదల, ఏప్రిల్ 30 (సిరి న్యూస్ ):**

బొంతపల్లి పారిశ్రామిక ప్రాంతంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మే డే) సందర్భంగా న్యూ లాండ్ పరిశ్రమ సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో శ్రామిక ఉత్సవ కమిటీ పలు కార్యక్రమాలను గురువారం ఘనంగా నిర్వహించారు. కార్మికుల ఐక్యత, హక్కుల పరిరక్షణ, మరియు శ్రామిక సంక్షేమం లక్ష్యంగా ఈ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. ఈ సందర్భంగా కార్మికుల కోసం ప్రత్యేకంగా ఇండోర్ గేమ్స్ పోటీలను నిర్వహించారు. చెస్, క్యారమ్స్, టేబుల్ గేమ్స్ వంటి పోటీలలో కార్మికులు చురుకుగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేసి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమాలు కార్మికుల్లో మరింత ఉత్సాహాన్ని నింపడంతో పాటు పరస్పర ఐక్యతను పెంపొందించాయి. మే డే వేడుకల సందర్భంగా కార్మికులకు చల్లని బట్టర్ మిల్క్ పంపిణీ చేశారు. ఎండ తీవ్రత మధ్య ఈ సేవ కార్మికులకు ఉపశమనం కలిగించింది. నిర్వాహకులు మాట్లాడుతూ కార్మికుల కష్టానికి గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వారి సంక్షేమం కోసం ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# గిరిజన సంస్కృతిని కాపాడుకుందాం

- **అనాథ బిడ్డలకు అండగా నిలుద్దాం**
- **జిల్లా కలెక్టర్ రాజర్షిషా**




**ఆదిలాబాద్(సిరి న్యూస్ ):** గిరిజన ఆర్థిక వ్యవస్థలో ఇప్ప పువ్వు కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం నార్నూర్ మండలం జామిడి గ్రామంలో నిర్వహించిన 9వ ఇప్ప పువ్వు పండుగ, అనాథ పిల్లల సంక్షేమ అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్ప పువ్వును శాస్త్రీయ పద్ధతిలో సేకరించి విక్రయించడం ద్వారా గిరిజనులు ఆర్థికాభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. ఇలాంటి ఉత్సవాలు గిరిజన సంస్కృతిని భావితరాలకు అందిస్తాయని పేర్కొన్నారు. ఐటిడిఎ ద్వారా రైతులకు, స్వయం సహాయక సంఘాలకు పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన “డీసీపీయూ సర్వే–చట్టబద్ధమైన దత్తత”అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లాలోని అనాథలు, వీధి బాలలను గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పిల్లలను దత్తత తీసుకోవాలనుకునే వారు మధ్యవర్తులను నమ్మి మోసపోకుండా, కేవలం సీఏఆర్ఏ ద్వారా ఆన్లైన్లోనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనధికారిక దత్తత చట్టరీత్యా అని హెచ ్చరించారు. పిల్లలకు కుటుంబ ప్రేమానురాగాలు అందించేందుకు ఫోస్టర్ కేర్ విధానాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 99 రోజుల యాక్షన్ ప్లాన్ ద్వారా పిల్లల విద్య, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని అన్నారు. ఇబ్బందుల్లో ఉన్న పిల్లలు కనిపిస్తే వెంటనే 1098 టోల్ ఫ్రీ నంబర్కు సమాచారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా “డిసిపియు సర్వే– చట్టబద్ధమైన దత్తత, ఫోస్టర్ కేర్”పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ పీఓ మంద మకరంద్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, ఐసీడీఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, గిరిజన నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.




# మున్సిపల్ పాలనపై పట్టు సాధించాలి

- **శిక్షణ తరగతుల్లో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్**

**ఆదిలాబాద్(సిరి న్యూస్ ):** మున్సిపల్ పాలనపై పట్టు సాధించాలని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో వరంగల్ రీజియన్కు చెందిన మున్సిపల్ చైర్పర్సన్లు, మేయర్లకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు. మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధి, పాలనా సంస్కరణలే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో భాగంగా మున్సిపాలిటీలకు సంబంధించిన పరిపాలన, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇంజనీరింగ్, శానిటేషన్ వంటి కీలక విభాగాలపై చైర్పర్సన్లకు అవగాహన కల్పించారు. ట్రేడ్ లైసెన్సులు, వాటర్ ట్యాక్స్, ప్రాపర్టీ ట్యాక్స్, యూజర్ ఛార్జీల వసూళ్ల ద్వారా మున్సిపాలిటీ సొంత ఆదాయాన్ని ఎలా పెంచుకోవాలో చర్చించారు. పట్టణాల్లో చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇచ్చారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ పనుల నాణ్యత, భవన అనుమతుల ప్రక్రియను ఎప్పటికప్పుడు సమీక్షించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వీధిదీపాలు, పారిశుధ్యం, తాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచుతామని చెప్పారు. మహిళా చైర్పర్సన్లు, మేయర్లు ఎదుర్కొనే సవాళ్లపై మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఉన్నతాధికారిణి శ్రీదేవి ప్రత్యేకంగా స్పందించారు. మున్సిపాలిటీల్లో ఎలాంటి సమస్యలు తలెత్తినా నేరుగా తమను సంప్రదించవచ్చని వివరించారు.

# దాంపత్య జీవితంలో జంటలు చేసే తప్పులివే..



దాంపత్య జీవితం అనేది ప్రతి ఒక్కరి జీవితంలో చాలా ముఖ్యమైన భాగం. ప్రతి ఒక్కరికి ఇది చాలా కీలకం కూడా. జీవితం ఎన్ని సమస్యలు విసిరినా జీవిత భాగస్వామి మద్దతుగా ఉంటూ సహకరిస్తే సప్త సముద్రాలైనైనా దాటేయొచ్చని కొందరు నిపుణులు చెప్తున్నారు. అదే దాంపత్య జీవితంలో చిన్న సమస్య మొదలైనా అది జీవితం మొత్తంపై తీవ్ర ప్రభావం చూపుతుందని చెప్తున్నారు. ఈ క్రమంలోనే ప్రస్తుత కాలంలో దంపతలు మధ్య అనేక సమస్యలు వస్తున్నాయని, అవి విడాకుల వరకు తీసుకెళ్తున్నాయని నిపుణులు చెప్తున్నారు. నిజంగా అవి విడిపోవాల్సినంత పెద్ద సమస్యలు కూడా కావాలని, చాలా సందర్భాల్లో చిన్నచిన్న సమస్యలనే దంపతులిద్దరూ పెద్దది చేసుకుంటున్నారని చెప్తున్నారు. ఈ నేపథ్యంలోనే అసలు దాంపత్య జీవితంలోకి అడుగు పెట్టిన తర్వాత దంపతులు చేస్తున్న తప్పల గురించి వివరించారు.

అంతేకాకుండా ఈ చిన్న చిన్న సమస్యలు కాస్తా తీవ్రతరం కావడం భార్యభర్తలు విడిపోతున్న ఘటనలు రోజురోజుకు అధికం అవుతున్నాయి. ఇవి యువతపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, వీటి కారణంగానే ప్రస్తుతం యువతలో చాలా మంది పెళ్లి చేసుకోవడానికి ఏమాత్రం ఆసక్తి చూపడం లేదని నిపుణులు చెప్తున్నారు. పైగా కొందరు పెళ్లి మాట ఎత్తితేనే చిరాకు, భయం, ఆందోళనకు చెందుతున్నట్లు కూడా నిపుణులు అంటున్నారు. అయితే వైవాహిక జీవితంలో సమస్యలు రావడం సహజమని, దానిని చూసి యువత ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్తున్నారు. వైవాహిక జీవంతో తరచుగా కొన్ని తప్పలు జరుగుతంటాయని, వాటిని నివారించుకుంటే వైవాహిక బంధం బలంగా ఉంటుందని వైద్యులు అంటున్నారు. ఇంతకీ దాంపత్య జీవితంలో తరచుగా దంపతులు చేసే తప్పలేంటంటే..

**అభిప్రాయ బేధాలు**

ఇద్దరు వ్యక్తుల మధ్య అభిప్రాయ బేధాలు రావడం సర్వసహజం. ప్రతి ఇద్దరి మధ్య ఏదో ఒక అంశంలో అభిప్రాయ విబేధాలు వస్తుంటాయి. ఇద్దరు వేరు వేరు ఆలోచనలున్న వ్యక్తులు కలిసి ఉన్నప్పుడు అభిప్రాయ భేదాలు రావడం సహజం. ఇలాంటి సందర్భంలో కూర్చుని మాట్లాడి పరిష్కరించుకోవాలి. పరస్పరం ఇద్దరూ సామరస్యంగా ఉంటే వారి సంబంధం కూడా బాగుంటుంది. సంబంధంలో ప్రేమ, స్నేహాన్ని పెంపొందించుకోవాలి.

**నమ్మకాన్ని పెంచుకోవాలి**

వివాహ బంధానికి నమ్మకం పునాది లాంటిది. దాంపత్య జీవితంలో ఒకరు మరొకరిపై అధికారం చెలాయించడం సరైనది కాదు. బంధం బలంగా ఉండాలంటే ఇలాంటి మనస్తత్వాన్ని వదిలేయండి. పరస్పరం నమ్మకాన్ని పెంపొందించుకోండి. మీ భాగస్వామికి స్వేచ్ఛనివ్వండి, వారి భావాలను కూడా గౌరవించండి. అలాగైతేనే ఇది ఆరోగ్యకరమైన సంబంధం అవుతుంది.

**ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు**

మీ భాగస్వామి ఆరోగ్యాన్ని మీరు చూసుకోవాలి నిజమే, కానీ దాని కన్నా ముఖ్యమైది మీ ఆరోగ్యాన్ని మీరు చూసుకోవడం. మీ వివాహంతో పాటు, పాత అలవాట్లు, స్నేహితులు, వ్యక్తిగత ఉద్యోగం, అవకాశాలను వదులుకోకండి. ఇది మానసికంగా మిమ్మల్ని దెబ్బతీస్తుంది. దీని తాళూకా ఒత్తిడి మీ బంధాన్ని కచ్చితంగా ప్రభావితం చేస్తుంది.

**ఓపెన్‌గా మాట్లాడుకోండి**

ఏది ఉన్నా మనసువిప్పి మాట్లాడుకోవడం ద్వారా 90శాతం సమస్యలు సమసిపోతాయి. అలా కాకుండా ఒక విషయాన్ని మనసులో దాచుకుంటే అది మరిన్ని సమస్యలకు దారితీస్తుంది. దంపతలు మధ్య దూరాన్ని పెంచుతుంది. మనస్పర్థలు రాకుండా ఉండాలంటే మీ భాగస్వామికీ మీకూ మధ్య ఓపెన్ , నిజాయితీ కమ్యూనికేషన్ ఉండేలా చూసుకోండి. మనసారా ఇద్దరూ మాట్లాడుకోండి, చర్చకు ప్రాధాన్యత ఇవ్వకపోతే ఇద్దరి మధ్య దూరం ఏర్పడుతుంది. కాబట్టి ఎల్లప్పుడూ ఫ్రీగా మాట్లాడుకుంటూ సంతోషంగా ఉండండి.

**సమయం కేటాయించడం ముఖ్యం**

పని ఒత్తిడి రోజూ ఉంటుంది. కానీ ఆ ఒత్తిడి మన వ్యక్తిగత జీవితంపై ప్రభావం చూపకుండా చూసుకోవాలి. పని ఒత్తిడిని కారణంగా చూపిస్తూ జీవిత భాగస్వామికి తగిన సమయం ఇవ్వకుండా ఉండకూడదు. జీవిత భాస్వామికి మనం కేటాయించే సమయమే ఇద్దరి మధ్య బంధాన్ని బలపరుస్తుంది. జీవనశైలి సమస్యల వల్ల పరస్పరం కలిసి ఉండటానికి సమయం లేదు అనిపించచ్చు. కానీ ఇది మీ వైవాహిక జీవితానికి ఎంత మాత్రం మంచిది కాదు. పరస్పరం ప్రత్యేకంగా సమయం కేటాయించుకోకపోతే భావాలను పంచుకోలేరు, మనసారా మాట్లాడుకోలేరు. ఇది బంధానికున్న విలువను తగ్గించేస్తుంది. స్పర్థలు పెరిగి గొడవలు, చికాకులకు దారితీస్తుంది.

**సమ్యలను కలిసి పరిష్కరించుకోండి..**

సమస్యలు ప్రతి ఒక్కరికి ఉంటాయి. వీటిని నీవి, నావి అని వేరు చేయకుండా మనవి అన్న ధోరణితో ముందుకు వెళ్లండి. సమస్యలో ఎవరిది ఒప్పు అని వాగ్వాదం చేసే బదులు ఆ సమస్యను ఎలా పరిష్కరించాలని ఆలోచించండి. జీవితంలో చాలా ఎత్తుపల్లాలు ఉంటాయి. కొన్నిసార్లు పెద్ద పెద్ద సమస్యలు వచ్చి పడతాయి. అటువంటి సందర్భాల్లో ఒకరిని ఒకరు నిందించుకోవడం మంచిది కాదు. బదులుగా అటువంటి సందర్భాలను కలిసి ఎదుర్కోండి. పరస్పర సహకారంతో ఇబ్బందుల నుంచి బయటపడండి.

**పరిమితులను గౌరవించండి**

వివాహం అయ్యాక భాగస్వామిగా వచ్చిన వెంటనే వారిపై పరిమితులు విధించడం సరైనది కాదు. ఇలా చేయడం వల్ల ఒత్తిడి ఏర్పడుతుంది. స్వేచ్ఛకు ఆటంకం కలుగుతుంది. వ్యక్తి ఇష్టాలు, అభిప్రాయాలకు అనుగుణంగా పరిమితులను గుర్తించి ముందుకు సాగితే మంచిది.


**రొమాన్స్ ఉండనివ్వండి**

వివాహం అయిన తర్వాత ఆనందం, ప్రేమ ఎల్లప్పుడూ ఇద్దరిలోనూ ఉండాలంటే భాగస్వామితో కాస్త రొమాంటిక్‌గా ఉండటం మర్చిపోకండి. అలాగే, సర్‌ప్రైజ్‌లు ఇవ్వడం కూడా ఆపకండి. అప్పుడప్పుడూ అయినా వారికి తెలియకుండా క్యాండిల్ లైట్ డిన్నర్ వంటి వాటిని ప్లాన్ చేయండి. భాగస్వామికి ఆనందంగా ఉంచేందుకు మీ వంతు ప్రయత్నం చేయడం మానుకోకండి.

**ప్రాధాన్యతలు ఇవ్వండి**

ఎలాంటి భావం కలిగినా కూడా దాన్ని పంచుకునేందుకు మీ భాగస్వామికి మొదటి ప్రాధాన్యతగా ఉండనివ్వండి. సంతోషకరమైన విషయమైనా, దుఃఖకరమైన విషయమైనా, భాగస్వామికే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని గుర్తుంచుకోండి. అన్నీ వారితో పంచుకోవడం వల్ల మీ వివాహ జీవితం సంతోషకంగా ఉంటుంది.

# అవిసె గింజలు తింటే ఎన్ని ప్రయోజనాలో..!



**డైటింగ్ చేద్దామని స్టార్ట్ చేసిన వారిలో చాలా మంది తమ ఆహారంలో అవిసె గింజలు యాడ్ చేసుకుంటారు. అవేనండి ఫ్లాక్ సీడ్స్ అంటారు కదా.. బరువు తగ్గాలని అనుకునే వారు కూడా అవిసె గింజలను తీసుకుంటారు. కానీ వీటిని తినడం వల్ల కలిగే లాభాలేంటి అంటే ఎవరూ సరైన సమాధానం కాదు కదా.. మచ్చుకకు రెండు మూడు కూడా చెప్పలేరు. దానర్థం వీటి వల్ల ఆరోగ్య లాభాలు లేవని కాదు. చాలా తక్కువ మందికి తెలుసని. అవిసె గింజలు మన శరీరక ఆరోగ్యానికి, మానసిక ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయి. మన గుండె, ఊపిరితిత్తులను పదిలంగా ఉంచడంలో అవిసె గింజలు అద్భుతంగా పనిచేస్తాయి. అంతేకాకుండా మన నరాలు, ఎముకల బలానికి కూడా ఇవి కీలకంగా పనిచేస్తాయి. మరి అవిసె గింజల వల్ల మరెన్ని లాభాలున్నాయో ఒకసారి చూసేద్దాం.**

అవిసె గింజల్లో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. వీటిలో ఉండే ఒమేగా 3, 6, థయామిన్, మెగ్నీషియం, కాపర్, ఫాస్పరస్ వంటివి అధికంగా ఉంటాయి. వీటిలోని ఒమెగా యాసిడ్స్ మన గుండె ఆరోగ్యానికి ఎంతో సహకరిస్తాయి. గుండె సరైన క్రమంలో కొట్టుకునేలా కూడా చేస్తాయి. ఫ్లాక్ సీడ్స్‌లో విటమిన్లు, విటమిన్ ఈ, బీ కాంప్లెక్స్, మెగ్నీషియం, ఐరన్, పొటాషియం వంటి ఖనిజాలు అధిక మోతాదులో ఉంటాయి. ఇవన్నీ కూడా మన ఎముకలు, చర్మ ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడతాయి.

పొటాషియం మన నరాల బలానికి ఉపయోగపడతాయి. వీటిలో ఉండే ఐరన్.. రక్త కణాలను సమృద్ధిగా ఉంచుతాయి. శరీరం అంతటా రక్త సరఫరా సక్రమంగా జరిగేలా కూడా అవిసె గింజలు చేస్తాయి. వీటిలో ఉండే ఫైటోకెమికల్స్, యాంటీ ఆక్సిడెంట్లు క్యాన్సర్ వచ్చే అవకాశాలు కూడా నియంత్రిస్తాయి. ఇందులోని లిగ్నాన్స్ శరీరంలోని హార్మోన్ల సమతుల్యతను కాపాడతాయి. వీటిలో ఉండే ఒమెగా3 ఫ్యాటీ యాసిడ్లు రొమ్ము, ప్రొస్టేట్, పెద్దపేగు క్యాన్సర్లు వచ్చే ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించడంలో దోహదపడతాయి.

ఫ్లాక్ సీడ్స్ మన రక్తంలోని షుగర్ లెవెల్‌స్‌ను నియంత్రించడంలో కూడా అవిసె గింజలు అద్భుతంగా పనిచేస్తాయి. వీటిలో ఉండే అధిక పీచు పదార్థం మనకు ఎక్కువ సేపు ఆకలి కాకుండా కూడా ఉంచుతాయి. తద్వారా అతిగా తినడకుండా మన నోరుకట్టేసుకోవడం సాధ్యమవుతోంది. దీని వల్ల శరీరంలోని క్యాలరీల ఇన్‌టేక్ గణనీయంగా తగ్గుతుంది. అది బరువు తగ్గడం కోసం ఉపయోగపడుతుంది.

అవిసె గింజల్లో 95శాతం ఫైబర్ ఉంటుంది. ఇది జీర్ణక్రియను సాఫీగా సాగేలా చేస్తుంది. అంతేకాకుండా వీటిలో రెండు రకాల ఫైబర్లు ఉంటాయి. వాటిలో ఒకటి జీర్ణక్రియ మెరుగుపరిస్తే మరొకటి చెడు కొవ్వును తగ్గించడంలో క కీలకంగా పనిచేస్తాయి. దాని కారణంగా వేగంగా బరువు తగ్గడం సాధ్యమవుతుంది. అంతేకాకుండా వీటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. వీటితో పాటుగా వీటిలో ఉండే ఒమెగా యాసిడ్స్, విటమిన్ ఇ రెండూ కూడా మన జుట్టుకు కూడా మేలు చేస్తాయి.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.